## కారు, బస్సు ఢీ.. ఐదుగురు మెడికోలు దుర్మరణం

కేరళ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అలెప్పి వద్ద వేగంగా వచ్చిన కారు బస్సును ఢీ కొట్టడంతో ఐదుగురు మరణించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతులు, క్షతగాత్రులంతా ఎంబీబీఎస్ ఫస్టియర్ స్టూడెంట్స్ గా గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత రాత్రి భారీ వర్షంలో వేగంగా వచ్చిన కారు.. కాలర్ కోడ్ వద్ద బస్సును ఢీకొట్టింది. కారు మొత్తం నుజ్జునుజ్జవ్వగా.. స్టూడెంట్స్ అంతా లోపలే ఇరుక్కుపోయారు. రంగంలోకి దిగిన సహాయక సిబ్బంది.. మెటల్ ను కట్ చేసి.. మృతులు, క్షతగాత్రుల్ని బయటికి తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్పగాయాలవ్వగా.. వారికి చికిత్స అందించారు. ప్రమాదంలో మరణించిన ఎంబీబీఎస్ స్టూడెంట్స్ దేవనందన్, లక్షద్వీప్ కు చెందిన మొహమ్మద్ ఇబ్రహీం, ఆయుష్ షాజి, శ్రీదీప్ వాల్సన్, మొహమ్మద్ జబ్బర్ గా గుర్తించారు. వీరంతా టీడీ మెడికల్ కాలేజీ లో మెడిసిన్ ఫస్టియర్ చదువుతున్నారని పోలీసులు తెలిపారు.

# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :244 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 04-12-2024 | పేజీలు:4 వెల: 2.00

## 45 ఏళ్ల తర్వాత మరణాలు.. చైనాపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: భారత్-చైనా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు విదేశాంగ మంత్రి జైశంకర్. గత కొద్ది నెలలుగా రెండు దేశాల మధ్య నిరంతర దౌత్య చర్చల ఫలితంగా సంబంధాలు మెరుగైనట్టు ఆయన తెలిపారు. భారత సరిహద్దుల విషయంలో కూడా కీలక పురోగతి నెలకొందని చెప్పుకొచ్చారు.ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈరోజు సమావేశాల్లో భాగంగా విదేశాంగ మంత్రి జైశంకర్..'భారత్-చైనా సంబంధాల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా జైశంకర్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ..'చైనా చర్యల కారణంగా 2020లో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతకు భంగం వాటిల్లింది. అప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే, నిరంతర దౌత్య చర్చల ఫలితంగా ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఇటీవల కొంత మెరుగుదల కనిపించిందని తెలిపారు.2020 ఏప్రిల్‌లో తూర్పు లడఖ్‌లోని కొన్ని ప్రాంతాలలో రెండు దేశాల సైన్యం మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గడిచిన 45 సంవత్సరాల కాలంలో మొదటిసారిగా రెండు వైపులా మరణాలకు ఈ ఘర్షణ దారితీసింది. అలాంటి పరిస్థితులు ఇప్పుడు లేవు. సరిహద్దు సమస్యకు న్యాయమైన, సహేతుకమైన.. పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావడానికి ద్వైపాక్షిక చర్చలు జరుగుతున్నాయి. ఇందుకు కోసం భారతదేశం కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఇటీవలి కాలంలో లడఖ్‌లోని భారత సరిహద్దుల నుంచి చైనా బలగాలు, భారత సైన్యం వెనక్కి వెళ్లినట్టు ఆయన తెలిపారు. గతంలో 38 వేల చదరపు కిలోమీటర్ల భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించింది. వాస్తవాధీన రేఖకు సంబంధించి కొన్ని ప్రాంతాలలో ఇరుదేశాలకు ఏకాభిప్రాయం లేదు. పరస్పరం అంగీకరించిన యంత్రాంగం ద్వారా శాంతియుతంగా సరిహద్దు సెటిల్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నాం. ఇటీవల జరిగిన బ్రిక్స్ సమావేశాల్లో కూడా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పలు విషయాలపై చర్చించారు' అని చెప్పుకొచ్చారు.

## ఇండియా కూటమిలో లుకలుకలు!

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమిలో చీలికలు మరోసారి బయటపడ్డాయి. అదానీ అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనకు తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు దరంగా ఉండటమే కారణం. సోమవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో జరిగిన ఇండియా కూటమి భేటీకి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ దుమ్మా కొట్టగా.. నేడు కాంగ్రెస్ చేపట్టిన నిరసనకు టీఎంసీతోపాటుసమాజ్‌వాదీ పార్టీ కూడా గైర్హాజరవ్వడం గమనార్హం.మంగళవారం ఉదయం ఉభ సభలు ప్రారంభమయ్యాక.. లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతుండగా కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు మళ్లీ ఆందోళనకు దిగాయి. అదానీ అంశం, సంభాల్ హింసపై తక్షణమే చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీనికి స్పీకర్ అంగీకరించకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, డీఎంకే, శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్‌చంద్ర) పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయి.అనంతరం అదానీ అంశంలో జేపీసీ వేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్షాలతో పార్లమెంట్ ఆవరణలో ధర్నా చేపట్టింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు ప్లకార్డులు చేతబట్టి భారీ ప్రదర్శన చేపట్టారు. అయితే ఆ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ మిత్రపక్షాలు సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు మిస్సయ్యాయి. ఈ రెండు పార్టీల ఎంపీలు సభా కార్యకలాపాల్లో పాల్గొనడంచర్చనీయాంశంగా మారింది.ఇక సోమవారం జరిగిన ఇండియా కూటమి కీలక సమావేశాన్ని తృణమూల్ కాంగ్రెస్ దాటవేసింది. కాంగ్రెస్‌కు ఒకే ఎజెండా ఉందని, అది తమది కాదని సూచించింది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిధుల కొరత, మణిపూర్ అశాంతి వంటి ఆరు కీలక అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తాలని తాము భావిస్తున్నామని, అయితే కాంగ్రెస్ అదానీ అంశాన్ని మాత్రమే ఒత్తిడి చేయాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే



ఛాంబర్‌లో జరిగిన సమావేశానికి ఆ పార్టీ నేతలు దూరంగా ఉన్నారని వారు తెలిపారు.ఇదిలా ఉండగా అదానీ, సంభాల్, అజ్మీర్ దర్గా, మణిపూర్ హింస సహా పలు అంశాలపై పార్లమెంట్ సమావేశాలు అట్టుడుకుతున్నాయి. వీటిపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో సమావేశాలు ప్రారంభ రోజు నుంచి ఉభయ సభలు కార్యకలాపాలేవీ జరపకుండానే వాయిదా పడుతున్నాయి.దీనికి తెరదించేలా విపక్షాలను ఒప్పించేందుకు ఓం బిర్లా కొద్ది రోజులుగా ప్రయత్నిస్తున్నారు. వాటికి కొనసాగింపుగా ఆయన సోమవారం అఖిలపక్ష బేటీ నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి గౌరవ్ గొగొయ్, డీఎంకే నుంచి టీఆర్ బాలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి కల్యాణ్ బెనర్జీ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుదిరిన సమన్వయ ఒప్పందం ప్రకారం సమాజ్‌వాదీ పార్టీ సంభాల్ అంశాన్ని, తృణమూల్ బంగ్లాదేశ్ సమస్యను లేవనెత్తేందుకు అనుమతించినట్లు సమాచారం. కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న మేరకు రాజ్యాంగంపై రెండు రోజుల ప్రత్యేక చర్చకు మోదీ సర్కార్ ఎట్టకేలకు అంగీకరించింది

## ఆ హత్యల వెనక మాస్టర్‌మైండ్ యూనసే...



న్యూఢిల్లీ,పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో కల్లోల పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. హిందువులు, హిందూ ఆలయాలపై దాడులతో మైనార్టీల భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల వేళ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలో ఇటీవల చోటుచేసుకున్న హత్యలు, తాజా అనిశ్చితికి తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనసే కారణం అని ఆరోపించారు.విద్యార్థుల నిరసనలతో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల కారణంగా నాలుగు నెలల క్రితం హసీనా అవమానకర రీతిలో స్వదేశాన్ని వీడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత్‌లోని ఓ రహస్య ప్రాంతంలో ఉంటున్న ఆమె తాజాగా న్యూయార్క్‌లో జరిగిన అవామీ లీగ్ కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరైనట్లు తెలుస్తోంది. ఈసందర్భంగా ఆమె యూనస్ పై కీలక ఆరోపణలు చేసినట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి."మూక హత్యలకు కారణమయ్యానంటూ ఈ రోజు నాపై కేసులు నమోదు చేస్తున్నారు. వాస్తవానికి ఆ రోజు విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆందోళనలకు కుట్ర పన్నిందే మహమ్మద్ యూనస్. నాటి అల్లర్లలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు బంగ్లాలో ఉపాధ్యాయులు, పోలీసులు.. ఇలా అందరిపైనా దాడులు జరుగుతున్నాయి. మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రార్థనా మందిరాలపై దాడులు చేస్తున్నారు. వీటన్నింటికీ మాస్టర్‌మైండ్ యూనసే" అని హసీనా దుయ్యబట్టారు.

### అందుకే దేశాన్ని వీడా..

ఈసందర్భంగా తాను దేశాన్ని ఎందుకు వీడాల్సివచ్చిందో ఆమె మరోసారి వివరించారు. "నా తండ్రిలాగే నన్నూ హత్య చేసేందుకు కుట్రలు జరిగాయి. వాటిని ఎదుర్కోవడం నాకు 25-30 నిమిషాలు పట్టదు. నా భద్రతా సిబ్బంది కాల్పులు జరిపి ఉంటే.. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయేవారు. కానీ, ఊచకోతను నేను కోరుకోలేదు. నేను అధికారం కోసం అక్కడే ఉంటే మారణహోమం జరిగేది. ప్రజలను విచక్షణారహితంగా చంపేస్తుండటంతోనే దేశం విడిచివెళ్లిపోవాలని నిర్ణయించుకున్నా. అందుకే ఆందోళనకారులపై కాల్పులు జరపొద్దని నా భద్రతా సిబ్బందికి చెప్పా" అని హసీనా నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు.విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా ఆగస్టు 5 నుంచి బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. నిరసనల సమయంలో ఆమె పార్టీ అవామీ లీగ్ మద్దతుదారులైన మైనారిటీలు, వారి ప్రార్థనా మందిరాలపై పెద్దఎత్తున దాడులు జరిగాయి. ఈ క్రమంలోనే వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హసీనాపై హత్య సహా పలు అభియోగాలపై కేసులు నమోదు చేశారు.మరోవైపు, మైనార్టీలపై దాడులకు నిరసనగా ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులు భారీ ర్యాలీలు నిర్వహించారు. అందులో జాతీయజెండాను అవమానించారనే ఆరోపణలతో ఇస్కాన్ ప్రచారకర్త, మైనారిటీల హక్కుల బృంద ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్‌ను ఢాకాలో అరెస్టు చేయడం, కోర్టు ఆయనకు బెయిల్ తిరస్కరించడం మళ్లీ ఉద్రిక్తతలకు దారితీసింది. కృష్ణదాస్ అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ మన దేశంలోనూ పలు చోట్ల ఆందోళనలు చోటుచేసుకున్నాయి.

### ఢిల్లీలోని ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలోని ఓ ఫోమ్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని కరవాల్ నగర్ ఏరియాలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్థానికులు సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు.

## ప్రతిపక్ష రాజకీయ కుట్రలు తిప్పికొట్టాలి...

హైదరాబాద్,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2023 డిసెంబర్ 3న తెలంగాణ లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజలు గత సంవత్సర కాలంగా ఏ విధంగా ఆశీర్వదించారో భవిష్యత్ కాలంలో కూడా ప్రతిపక్ష రాజకీయ కుట్రలు తిప్పికొట్టి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి బలోపేతం చేయాలని కోరారు.రాబోయే కాలంలో ప్రజల ఆకాంక్షలను మరింత ముందుకు తీసుకెళ్లేలా పాలనను అందిస్తామని పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులుగా మెజారిటీ విజయం సాధించామని తెలిపారు. సంవత్సర కాలంగా పరిపాలనకు సహకరించిన ప్రజలందరికీ తెలంగాణ ప్రభుత్వం పక్షాన, కాంగ్రెస్ పార్టీ పక్షాన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు.ముఖ్యంగా ఉద్యమకారుడిగా విద్యార్థి నాయకుడిగా తెలంగాణ సాధనలో తన బాధ్యతను చూసి హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి తనను శాసన సభ్యుడుగా గెలిపించిన హుస్నాబాద్ ప్రజలకు ధన్యవాదాలని పొన్నం ప్రభాకర్ తెలిపారు. తప్పకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ సంవత్సర కాలంలో రైతులు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు, విద్యా, వైద్య



ఇతర రంగాల్లో సంస్కరణలు చేశామని చెప్పారు. భవిష్యత్తులో 4 సంవత్సరాల కాలంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాస్వామ్య విలువలతో ప్రజాస్వామ్య రక్షణకై కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటుందని అన్నారు.

## ఒత్తిడి తట్టుకోలేక పోతున్నాం..చచ్చిపోతాం..శ్రీ చైతన్య విద్యార్థినిలు




హైదరాబాద్ : చదువుల ఒత్తిడి భరించలేకున్నాం తాము ఇక్కడ ఉండలేమంటున్న మియాపూర్‌లోని చైతన్య గర్ల్స్ క్యాంపస్ విద్యార్థినిలు. తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామంటూ గోడ మీద రాతలు రాశారు. దీనిని చూసిన యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించింది. తాము ఇంటి వెళ్లిపోతామంటుని వారు చెబుతున్నట్లు సమాచారం. క్యాంపస్‌లో మొత్తం 15 వందల మంది ఉండగా.. 12 వందల మంది ఇంటికి వెళ్లిపోయారు. మరో మూడు వందల మంది మాత్రమే ప్రస్తుతం హాస్టల్ ఉన్నారు. వీరు కూడా ఇంటికి వెళ్లిపోతామని చెబుతున్నట్లు సమాచారం. అయితే ఈ రాతలు చెరిపేసేందుకు కాలేజీ సిబ్బంది ప్రయత్నించారు.అంతే కాదు మూడు రోజుల పాటు కాలేజీకి ఔటింగ్ ఇచ్చామని చెప్పి ఉద్యార్డులను ఉన్నపళంగా ఇంటికి పంపించేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కాలేజీ క్యాంపస్ ఎదుట ఆందోళనకు దిగారు. మంచిగా చదవులు చెబుతారని.. పిల్లలు భవిష్యత్తు బాగుండాలని కాలేజీలో జాయిన్ చేస్తే.. యాజమాన్యం మాత్రం పిల్లలను ఒత్తిడికి గురిచేస్తున్నారంటూ .. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారు.. విద్యార్థునిలు..

శ్రీ చైతన్య కాలేజీ యాజమాన్యం, ప్రిన్సిపల్ తమపై తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని విద్యార్థునులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం చదువులు, మార్కులు అంటూ ర్యాష్‌గా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఇదే కాలేజీలో ఇటీవల ఓ విద్యార్థి ఒత్తిడి కారణంగానే బ్లేడ్‌తో చెయ్యి కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిందని.. గత కొద్దిరోజుల క్రితం మరో అమ్మాయి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయతినించిందని మీడియా ముందు వాపోయారు. ఇలా వరుస ఘటనలు తమను తీవ్ర ఆందోళకు గురిచేస్తున్నాయని విద్యార్థునిలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ వత్తిడిలో చదువు కొనసాగించలేక చనిపోదామని అనుకుంటుమన్నామంటూ వారు చెబుతున్నారు.

### ఒకే రోజు విద్యార్థులు ఆత్మహత్య

ఇదిలా ఉంటే.. సోమవారం నాడు మేడ్చల్ జిల్లా అన్నోజిగూడలోని నారాయణ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న తనూష్ అనే విద్యార్థి సూసైడ్ చేసుకున్నాడు,. లెక్చరర్ వేధింపులతోనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.. అలాగే నిజామాబాద్ లోకూడా నిన్న ప్రజ్ఞారెడ్డి అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. చదువుల వత్తిడి తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకున్నట్లు సహ విద్యార్థులు చెబుతున్నారు..

## కొత్త న్యాయ చట్టాల అమలును జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

చండీఘడ్: నూతనంగా తీసుకువచ్చిన మూడు నేర చట్టాలను జాతికి అంకితం చేశారు ప్రధాని మోదీ. ఇవాళ చండీఘడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్ చట్టాలను జూలై ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ అండ్ ద ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు చట్టాలను ఇటీవల కేంద్ర సర్కారు రద్దు చేసింది.కొత్త మూడు న్యాయ చట్టాలను వంద శాతం అమలు చేసిన నగరంగా చండీఘడ్ నిలిచింది. ఈ నేపథ్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలు, ప్రాముఖ్యతకు లోటు రాకుండా భారతీయ న్యాయ సంహిత రూపొందించినట్లు ప్రధాని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆశయాల దిశగా అడుగులు వేసేందుకు కొత్త క్రిమినల్ చట్టాలను ఉపయోగపడుతాయన్నారు. కొత్త చట్టాలతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. డిజిటల్ ఆధారాలు, టెక్నాలజీ ఏకీకరణతో.. ఉగ్రవాదంపై పోరాడేందుకు సులువు అవుతుందని, ఉగ్రవాదులు.. ఉగ్ర సంస్థలు తప్పించుకోలేని రీతిలో కొత్త చట్టాలు పకడ్బందీగా ఉన్నట్లు




ప్రధాని తెలిపారు.గతంలో ఉన్న క్రిమినల్ చట్టాలు భారతీయుల్ని శిక్షించాలన్న ఉద్దేశంతో ఉన్నాయని, వాళ్లను బానిసలుగా చూసే విధంగా చట్టాలను ఉన్నట్లు చెప్పారు. బానిసల కోసం చట్టాలను మనం ఎందుకు అమలు చేయాలని ప్రధాని ప్రశ్నించారు. బ్రిటీష్ కాలం నాటి మైండ్‌సెట్ నుంచి దేశ ప్రజలు బయటపడాలన్నారు.

## తెలంగాణ పోరాటంలో శ్రీకాంత్‌చారి సేవలు ఎనలేనివి



హైదరాబాద్, నవంబర్ 3 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాళులర్పించారు. అగ్నికి ఆహుతి అవుతూ 'జై తెలంగాణ' అంటూ దిక్కులు పెక్కటిల్లేలా నినదించిన పోరాట యోధుడు శ్రీకాంతా చారి అని చెప్పారు. కేసీఆర్ అరెస్టును, ఉద్యమకారులపై ప్రభుత్వ అణచివేతను సహించలేక ఆత్మబలిదానం చేసుకున్న తెలంగాణ అమరుడని తెలిపారు. జోహార్ శ్రీకాంతాచారి అంటూ ట్వీట్ చేశారు. కెసిఆర్ గారి అరెస్టును, ఉద్యమ కారులపై ప్రభుత్వ అణిచివేతను సహించలేక ఆత్మబలిదానం చేసుకున్న తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా నివాళి. 2009, నవంబర్ 29న ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకున్నారు. కరీంనగర్ నుంచి సిద్దిపేట దీక్ష స్థలికి వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. దీంతో తెలంగాణ అంతటా ఆందోళనలు, ఉద్యమాలు, నినాదాలతో రాష్ట్రం అట్టుడికిపోయింది. తెలంగాణ ఉద్యమకారులపై ప్రభుత్వం అణచివేతలు ప్రారంభించింది. ఉద్యమకారులపై లాఠీ దెబ్బలు, అరెస్టులు చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి.. కేసీఆర్ అరెస్టు నిరసనగా హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తాలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. అగ్నికి ఆహుతి అవుతూనే జై తెలంగాణ అంటూ దిక్కులు పెక్కటిల్లేలా నినాదాలు చేశారు. 80 శాతానికిపైగా కాలిపోయిన ఆయనను పోలీసులు, ఉద్యమకారులు సమీపంలోని దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం యశోదకు తీసుకెళ్లారు. రెండు రోజుల తర్వాత ఉస్మానియా దవాఖాను తరలించారు. అక్కడి నుంచి అపోలో హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డిసెంబర్ 3న శ్రీకాంతా చారి అమరుడయ్యారు.

## సంపాదకీయం

బుధవారం 04-12-2024

### ఇక జోరుగా ఎగుమతులు

దేశ వ్యవసాయ రంగంలో వరి కీలకమైన పంట. దీని సాగులో చోటుచేసుకునే మార్పులు ప్రపంచవ్యాప్తంగా బియ్యం ఉత్పత్తిని, ధరలను ప్రభావితం చేస్తాయి. నిల్వలు సమృద్ధిగా ఉండటం, ప్రస్తుత ఖరీఫ్‌లో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాల నేపథ్యంలో- భారత్ ఇటీవల బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై ఆంక్షలను ఎత్తేసింది.దేశ వ్యవసాయ రంగంలో వరి కీలకమైన పంట. దీని సాగులో చోటుచేసుకునే మార్పులు ప్రపంచవ్యాప్తంగా బియ్యం ఉత్పత్తిని, ధరలను ప్రభావితం చేస్తాయి. నిల్వలు సమృద్ధిగా ఉండటం, ప్రస్తుత ఖరీఫ్‌లో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాల నేపథ్యంలో- భారత్ ఇటీవల బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై ఆంక్షలను ఎత్తేసింది. దాంతో ఈ ఎగుమతులు ఊపందుకోనున్నాయి.బియ్యం ఎగుమతులపై విధించిన ఆంక్షలను భారత ప్రభుత్వం ఒక్కొక్కటిగా తొలగించింది. 2023, జులై 20న కేంద్రం బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. ఇటీవల వాటిని పూర్తిగా తొలగించింది. పారాబాయిల్డ్, పొట్టు (బ్రౌన్)బియ్యంపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేసింది. బియ్యం టన్నుకు రూ.41,201గా ఉన్న కనీస ఎగుమతి ధరను సైతం ఎత్తేసింది. ప్రభుత్వ నిర్ణయాలతో దేశం నుంచి బియ్యం ఎగుమతులు త్వరలో ఊపందుకుంటాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2024-25 మార్కెటింగ్ సంవత్సరం(అక్టోబరు-సెప్టెంబరు)లో ఎగుమతులు 2.05 కోట్ల టన్నులకు చేరుకుంటాయని అవి భావిస్తున్నాయి.

నిషేధ కాలంలోనూ...

ఆహార ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం కోసం బియ్యం ఎగుమతులపై ప్రభుత్వం నిరుడు ఆంక్షలు విధించింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ధర టన్నుకు రూ.50,450 (600డాలర్లు) వరకు పెరిగింది. ఆ సమయంలో థాయ్‌లాండ్, వియత్నాం, పాకిస్థాన్ తమ బియ్యం ఎగుమతులను పెంచుకున్నాయి. అయితే, భారత్ ఎగుమతులపై నియంత్రణలను ఎత్తేయడంతో బియ్యం ధరలు టన్నుకు రూ.48,348 (575డాలర్లు) కంటే తక్కువకు పడిపోయాయి. ఎగుమతులపై నిషేధం ఉన్న కాలంలోనూ మాల్దీవులు, మారిషస్, యూఏఈ సహా పలు ఆఫ్రికన్ దేశాలకు భారత్ కొంతమొత్తంలో బియ్యం రవాణా చేసింది.బాస్మతీయేతర బియ్యాన్ని భారత్‌లో విస్తృతంగా వినియోగిస్తారు. ప్రపంచ మార్కెట్‌లో, ప్రత్యేకించి ప్రవాస భారతీయులు ఎక్కువగా ఉన్న దేశాల్లో వీటికి డిమాండ్ అధికం. అయితే, ఆంక్షల కారణంగా 2023-24లో బాస్మతీయేతర బియ్యం ఎగుమతులు సుమారు 1.11 కోట్ల టన్నులకు తగ్గిపోయాయి. అంతకుముందు ఏడాదిలో అవి 1.78 కోట్ల టన్నుల మేర ఎగుమతి అయ్యాయి.దేశ ఆహారభద్రతకు వరి చాలా కీలకం. అయితే- అధిక ఉష్ణోగ్రతలు, ఆకస్మిక వరదలు, కరవులతో పంటనష్టం అధికంగా ఉంటోంది. దాంతో తీవ్ర వాతావరణ పరిస్థితులను తట్టుకునే నూతన వంగడాలను తీసుకురావడంపై 'జాతీయ వరి పరిశోధన సంస్థ' దృష్టి సారించింది. దేశంలోని స్థూల పంట విస్తీర్ణంలో దాదాపు 23.3 శాతాన్ని వరి ఆక్రమిస్తోంది. మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తిలో బియ్యం వాటా 43శాతం. ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే అధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. ఉత్పత్తిలో చైనా తరవాత రెండో స్థానం మనదే. నిజానికి 1970 వరకు దిగుమతిదారుగా ఉన్న భారత్, 2000లో ఆహారధాన్యాల ప్రధాన ఎగుమతిదారుగా అవతరించింది. దేశంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు సాధారణ విస్తీర్ణం 409.55 లక్షల హెక్టార్లకు పెరిగింది. బియ్యం నిల్వలు గత 20 ఏళ్లలోనే ఎన్నడూ లేనంతగా దాదాపు మూడు కోట్ల టన్నులకు చేరుకున్నట్లు భారత ఆహార సంస్థ గణాంకాలను బట్టి తెలుస్తోంది. 2023-24లో దేశంలో 1357.55 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అయ్యాయి. 2024-25లో అది 1378.28 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా.

అంతర్జాతీయ గిరాకీ

మన దేశ బాస్మతి బియ్యానికి ఎంతో ప్రత్యేకత ఉంది. రుచి, పోషక విలువల కారణంగా ఈ రకానికి అంతర్జాతీయంగా డిమాండ్ ఏర్పడింది. బాస్మతి ఉత్పత్తిలో ఇండియాదే మొదటిస్థానం. దీన్ని ఎక్కువగా పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సాగు చేస్తున్నారు. 2023-24లో భారత్ 52.42లక్షల టన్నుల బాస్మతి రకాన్ని ఎగుమతి చేసింది. ఈ బియ్యాన్ని ఎక్కువగా కెనడా, ఇరాక్, ఒమన్, సౌదీ అరేబియా, యూకే, అమెరికాలు దిగుమతి చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్రం బాస్మతి బియ్యం ఎగుమతులను ప్రోత్సహించడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలి. వరి సాగును లాభసాటిగా మార్చితే రైతులతో పాటు దేశార్థికమూ బలోపేతమవుతుంది.

ఉత్తరాదిలో ఎక్కువ

జనాభా పరంగా ఇండియా ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర స్థానంలో నిలుస్తోంది. కానీ, దేశీయంగా కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా దక్షిణ, తూర్పు భారతాల్లో సంతాన సాఫల్య రేటు కొన్నేళ్లుగా తగ్గుతోంది. మరికొన్ని చోట్ల అది పెరుగుతోంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో సంతాన సాఫల్య రేటు ఎక్కువగా ఉంది. మొత్తం జనాభా పెరుగుదలలో 33శాతం ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లలోనే కనిపిస్తోంది. జన సంఖ్య వృద్ధిలో ఆయా ప్రాంతాల వాటా ఎంతంటే... (శాతాల్లో)

# మరిన్ని అయోధ్యలు!



న్యాఢిల్లీ,వారణాసి, మథుర వివాదాలకు ఒక వైపు ఆజ్యం పోస్తున్న బిజెపి, సంఘ్ పరివార్ శక్తులు, కొత్తగా ఉత్తరప్రదేశ్‌లో సంభాల్, రాజస్థాన్‌లో అజ్మీర్‌లకు తమ విచ్ఛిన్నకర చర్యలను విస్తరించాయి. సంభాల్‌లో 16వ శతాబ్దం మొఘలుల కాలం నాటి షాహీ జామా మసీదులో సర్వేను ముందుకు తెచ్చాయి. అయోధ్య మాదిరిగానే ఇక్కడ కూడా హిందువుల దేవాలయాన్ని కూల్చేసి మసీదు నిర్మించారని నానా యాగీకి దిగాయి. సర్వేపై స్థానిక జిల్లా కోర్టులో పిటిషన్ వేసి తక్షణ ఆదేశాలు తెచ్చారు. కోర్టు ఉత్తర్వులే తడవు యుపి ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు నవంబర్ 19న తొలి విడత మసీదులో సర్వేకు ఉపక్రమించినప్పుడే స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. రెండవ తడవ సర్వేకి 24 ఆదివారం భారీ ప్రభుత్వ, పోలీస్ పటాలాలతో చెప్పాపెట్టకుండా విరుచుకుపటంతో స్థానికుల్లో ఆందోళన అధికమై ప్రతిఘటనకు దిగగా నిర్దాక్షిణంగా తుపాకులకు పనిచెప్పి ఐదుగురిని పొట్టనబెట్టుకున్నారు. భాష్పవాయువు, లాఠీఛార్జీలు, బాధితులపైనే తప్పుడు కేసులు, మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష ఎంపి, ఎంఎల్ఎల నిర్బంధాలు ఇంటర్నెట్ బంద్, పౌరుల కదలికలపై నిషేధాజ్ఞలతో యోగి సర్కారు అత్యంత దుర్మార్గంగా వ్యవహరించింది. మసీదు నిర్వాహకులు సుప్రీం కోర్టును ఆశ్రయించగా జనవరి 6 వరకు ఎలాంటి సర్వేలు చేపట్టవద్దని ఆదేశించింది. అంతేకాదు, యోగి ప్రభుత్వం, పోలీసులు, అధికారులు తటస్థంగా వ్యవహరించాలని గడ్డి పెట్టింది.దేశంలో కొద్దిపాటి లోకజ్ఞానం కలిగిన ప్రతి ఒక్కరికీ రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా ఎరుకే. దర్గా ఏ ఒక్క మతానికో పరిమితం కాదు. జనులందరూ గౌరవిస్తారు. సూఫీల క్షేత్రాల్లో ప్రాశస్త్యమైనది. సదరు దర్గా 12వ మతగురువు ఖాజామొయినుద్దీన్ చిస్తీ వార్షిక ఉరుసు ఉత్సవానికి చాదర్‌ను పంపినట్లు ప్రధాని మోడీ ఇటీవల ప్రముఖంగా ప్రకటించుకున్నారు. ఆ దర్గాను హిందువుల దేవాలయాన్ని పడేసి కట్టారంటూ సర్వే కోసం కోర్టు నుంచి ఆర్డర్ సంపాదించాయి పరివార్ శక్తులు. దీనిపై మోడీ జోక్యం చేసుకొని సర్వేని ఆపించాలని డజను మంది మాజీ అధికారులు, దౌత్యవేత్తలు లేఖ రాసి రోజులు గడుస్తున్నా ప్రధాని నుంచి ఎలాంటి స్పందన లేదు. భక్తి ఉద్యమం, కరుణ, సామరస్యం లక్ష్యంగా పని చేసిన 12వ శతాబ్దం మతగురువు గుడి కూలగొట్టి దర్గా నిర్మించారనే హిందుత్వ శక్తుల వాదన పనిగట్టుకొని విద్వేషాలు రెచ్చగొట్టే పన్నాగమని మతాలకతీతంగా ప్రజలు సులభంగానే అర్థం చేసుకోగలరు.అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టు తుది తీర్పు వచ్చిన సందర్భంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పందిస్తూ అయోధ్య వంటివి దేశంలో ఇంకా చాలా ఉన్నాయని ప్రకటించారు. వారణాసిలో జ్ఞానవాపి, మథురలో షాహీ ఈద్గా, ప్రస్తుత సంభాల్, అజ్మీర్ ఆ కోవలోకే వస్తాయి. పురాతన మసీదుల్లో హిందు దేవాలయాల ఉనికిని కనుగొనేపనిలో సంఘ్ పరివారం పడింది. కింది స్థాయి కోర్టుల్లో పిటిషన్లు వేసి సర్వేలకు అనుమతులు తీసుకొని మత విద్వేష మంటలను ఎగదోస్తోంది. 1991లో తెచ్చిన ప్రార్ధనా స్థలాల చట్టం, స్వాతంత్యం నుంచి అన్ని మత ప్రార్ధనా స్థలాలపై యథాతథ స్థితి కొనసాగిస్తుంది. ఆ చట్టానికి విరుద్ధంగా కింది కోర్టులు సర్వేలని, మరొకటని ఇష్టానుసారం ఉత్తర్వులిస్తున్నాయి. ఇటువంటి ఉత్తర్వులు రాకుండా సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాల్సి ఉంది. కాగా 2022లో జ్ఞానవాపి కేసు విచారణ సందర్భంగా అప్పటి సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ 'మత పరమైన స్వభావాన్ని నిర్ధారించడం నిషేధించబడదు' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసి కందిరీగల తుట్టెను కదిపారు. ఈ వ్యాఖ్యలు మత ఉద్రిక్తతలు రగిల్చే ఎజెండాతో పని చేస్తున్న హిందుత్వ శక్తులకు ఉత్ప్రేరకంగా మారడం ఆందోళనకరం. పదేళ్ల మోడీ జమానాలో మన లౌకిక వారసత్వం, నాగరికతపై దాడి తీవ్రమైంది. చివరికి రాజ్యాంగానికే హాని తలపెట్టాయి. కేంద్రంలో మోడీ సర్కారు, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు అటువంటి విచ్ఛిన్నకర దాడులకు అండదండలందించడం అత్యంత ప్రమాదకరం. ప్రజల మధ్య శాంతి సామరస్యం నెలకొనాలంటే, మైనార్టీలకు రక్షణ, భరోసా దక్కాలంటే విద్రోహ శక్తులను ఒంటరిపాటు చేయాలి. ప్రజల ఐక్యతతోనే సాధ్యం.

### సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట

అమరావతి, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు, వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జి సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. టీడీపీ, వైసీపీ నేతలపై అసభ్యకర పోస్టులను పెట్టిన కేసుల్లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆయన ఆశ్రయించారు. అయితే ఈ పిటిషన్ ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టులో పిటిషన్లు వేసుకోవాలని సూచించింది. ఏపీ హైకోర్టును ఆశ్రయించేందుకు ఆయనకు రెండు వారాల సమయం ఇచ్చింది. అప్పటి వరకు భార్గవరెడ్డిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. భార్గవరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్, ఏపీ ప్రభుత్వం తరపున మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. పాత విషయాలకు కొత్త చట్టాల ప్రకారం కేసులు పెడుతున్నారని సిబాల్ అన్నారు.

# ఫ్లై యాష్ పవర్ వార్! వ్యర్థం కాదు, సిరుల కొండ

సెంట్రల్ డెస్క్ :ఏపీలో రాజకీయ వివాదాలకు ఫ్లై యాష్ కేంద్ర బిందువుగా మారింది. లీడర్లకు ప్రధాన వనరుగా.. ఇదే ధనాధారం కావడంతో తగ్గేదే లేదంటున్నారు పలువురు లీడర్లు. వైసీపీ, కూటమి నేతల మధ్య సైలెంట్ వార్ సృష్టిస్తున్న ఫ్లై యాష్ విషయంలో సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం పిలుపుతో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మరో నేత భూపేష్‌రెడ్డి సచివాలయానికి వచ్చి భేటీ అయ్యారు. జ్వరం వల్ల రాలేనని జేసీ ప్రభాకర్‌రెడ్డి సమాచారమిచ్చినట్టు తెలుస్తోంది.ఇక.. ఫ్లైయాష్ కాంట్రాక్టులో నేతల మధ్య వివాదం కారణంగా కూటమి ప్రతిష్ట దెబ్బతింటుందని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఫ్లై యాష్ ఎలా వస్తుంది..ఏపీలో ప్రధాన థర్మల్ కేంద్రాలు డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ , రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్, శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ -కృష్ణపట్నం.. తదితర థర్మల్ పవర్ స్టేషన్లలో మొత్తం 5,010 మెగావాట్ల విద్యుదుత్పతి సామర్థ్యంతో నడుస్తున్నాయి. ఇందుకు విజయవాడ ఎన్టీటీపీఎస్‌కు రోజుకి 24,600 టన్నుల బొగ్గు కావాలి. ఆర్టీపీపీకి రోజుకు 21000 టన్నులు, దామోదరం సంజీవయ్య పవర్ స్టేషన్‌కి రోజుకు 13,600 టన్నుల బొగ్గు కావాలి. అంటే ప్రతి రోజూ 55000 టన్నుల బొగ్గును కాలిస్తే 5010 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. సుమారు 19000 వేల టన్నుల ఫ్లైయాష్ ఉత్పత్తి అవుతుంది.విద్యుదుత్పత్తి చేసే థర్మల్ పవర్ స్టేషన్లో ఒక టన్ను బొగ్గును కాలిస్తే 350 కిలోల బూడిద మిగులుతుంది. ఈ బూడిదే బంగారమై పోతోంది. సిమెంటు తయారీలో వినియోగం.. భవన నిర్మాణ రంగంలో కీలకమైన ఈ సిమెంటు ఉత్పత్తిలోనూ థర్మల్ పవర్ స్టేషన్ ఫ్లైయాష్ ఎంతో అవసరం. సిమెంటు తయారీ ఖర్చును తగ్గిస్తుంది. అందుకే సిమెంటు కంపెనీలు బారులు తీరుతాయి..ఇంతకీ సిమెంటు ఉత్పత్తిలో ఫ్లైయాష్ పాత్ర ఏమిటి? సిమెంట్ అత్యంత గిరాకీ కావటంతో ఫ్లై యాష్ మిశ్రమంతో సిమెంటు ఉత్పత్తి జరుగుతోంది. ఫ్లై యాష్ స్లాగ్ సాధారణంగా పోర్ట్ ల్యాండ్ సిమెంట్ కంటే 18 శాతం చౌకగా లభిస్తాయి. సిమెంటు మిక్స్‌లో 20 శాతం ఫ్లై యాష్ ఉన్నప్పుడు, ఇది ఉత్పత్తి ఖర్చులో 3.5 శాతం ఆదా అవుతుంది. అందుకే సిమెంటు ఫ్యాక్టరీలు ఫ్లైయాష్ కోసం బారులు తీరుతాయి.

ఉచితంగా తీసుకెళ్లే చాన్స్..

థర్మల్ పవర్ స్టేషన్ ల్లో బొగ్గు వినియోగంలో మూడోవంతు పరిణామంలో బూడిద ఉత్పత్తి అవుతుంది. ఈ బూడిదను ప్రత్యేక కొలనుల్లో పవర్ ప్లాంట్ యాజమాన్యాలు నిల్వ చేసుకోవాలి. 20 శాతం బూడిదను రిజర్వు చేసి .. మిగిలిన బూడిదను వదిలించుకోవాలి. ఉచిత మంత్రంతో ఫ్లైయాష్‌ను వివిధ అనుబంధ కంపెనీలకు ఇచ్చేవి. ఈ స్థితిలోనే బ్రిక్స్ ఇండస్ట్రీ పుంజుకుంది. కానీ థర్మల్ పవర్ స్టేషన్లు సంఖ్య పెరిగే కొద్దీ ఫ్లైయాష్ కొండలు అవతరిస్తున్న తరుణంలో.. పర్యావరణానికి విఘాతం అనివార్యమైంది.ప్రతి ప్లాంటు 100 శాతం యాష్‌ను సద్వినియోగం చేయాలని, లేనిపక్షంలో టన్నుకు రూ.1,000లు పరిహారం చెల్లించాలని 2021 డిసెంబరు 31న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో తమ బూడిదను ఉచితంగా తీసుకువెళ్లాలని కంపెనీల వెంట పడ్డాయి.

బూడిదపై అదానీ మార్క్.. టన్ను బూడిద ?3400

థర్మల్ పవర్ ప్లాంట్ లో విడుదలయ్యే బూడిదనూ అదానీ కంపెనీ ఆదాయ వనరుగా మార్చుకుంది. దేశంలో అత్యధికంగా అదానీ సంస్థకే పవర్ ప్లాంట్లు ఉన్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్.. ఇలా 8 చోట్ల 13,650 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లాంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి సుమారు 1.5 కోట్ల టన్నుల ఫ్లైయాష్ వస్తోంది. ఈ బూడిదను ఉచితంగా ఇవ్వడానికి అదానీ కంపెనీ ఒప్పలేదు. దాంతో కేంద్ర ఇంధన శాఖను ప్రభావితం చేసి ఓ సలహా ఇప్పించింది. దేశంలోని ప్రతి థర్మల్ పవర్ ప్లాంటు ఫ్లైయాష్‌ను ఎవరికీ ఉచితంగా ఇవ్వవద్దని, టెండర్ ప్రాసెస్‌లో విక్రయించాలని, ఒకవేళ బూడిద మిగిలితే ఉచితంగా ఇవ్వాలని ఉత్తర్వులు ఇప్పించింది.అంతే బూడిద ధర మార్కెట్ తెర మీదకు వచ్చింది. టన్ను బూడిద ధర 15 డాలర్లు (?1200లు) నిర్ణయించారు. బ్రిక్ పరిశ్రమలు బిక్క చచ్చిపోయాయి. ఇప్పుడు టన్ను బూడిద ధర ?3400లకు చేరింది. ఎన్జీటీ వద్దంటే.. సుప్రీంకు వెళ్లిన అదానీఫ్లైయాష్‌ను వ్యాపారంగా మార్చిన ఇంధన శాఖ నిర్ణయంపై ఏపీకి అమరావతి ఫ్లైయాష్ బ్రిక్ తయారీదారుల అసోసియేషన్ సహా మరికొన్ని అసోసియేషన్లు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)ని ఆశ్రయించాయి.ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా సరే ఎవరైతే కాలుష్యం సృష్టిస్తారో వారే దాని వ్యయం భరించాలనేది ప్రాథమిక సూత్రమని, అటవీ పర్యావరణ శాఖ కూడా అదే చెబుతోందని పిటిషన్ దాఖలు చేశారు. ఈ లెక్కన ఫ్లైయాష్ కాలుష్య కారకం కాబట్టి.. దాన్ని వదిలించుకునే వ్యయాన్ని పవర్ ప్లాంట్లే భరించాలి. ఉచితంగానే ఇవ్వాలని, డబ్బులు వసూలు చేయకూడదని కోరాయి. ఇది న్యాయసమ్మతంగా ఉందని భావించిన ఎన్జీటీ.. ఇంధన శాఖ సలహాను పాటించాల్సిన అవసరం లేదని, దాన్ని అబయెన్స్‌లో పెడుతూ ఉత్తర్వులు ఇచ్చింది.దాంతో అదానీ సంస్థలు గిలగిలలాడి.. ఇంధన శాఖను సుప్రీం కోర్టుకు పంపింది. అక్కడ ఎన్జీటీ ఆదేశంపై స్టే లభించింది. దేశవ్యాప్తంగా అన్ని సంస్థలు ఫ్లైయాష్‌కు టెండర్లు ఆహ్వానించాయి. సిమెంటు ఫ్యాక్టరీలు, బ్రిక్స్ కంపెనీలు థర్మల్ పవర్ స్టేషన్లకు క్యూకట్టాయి.

జగన్ సర్కారు హయాంలో..

రాజకీయ నాయకులు బూడిదను సిరులు పండించే పంటగా మార్చేశారు. ఉచిత బూడిదను అమ్ముకుని కోట్లు గడించారు. రాజకీయ పార్టీలన్నీ బూడిదకు క్యూకట్టాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ నాయకులు బూడిద సామ్రాట్టులుగా అవతరించారు. ఇబ్రహీపట్నం నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ ఇలాఖాలో పాతికేళ్లుగా ఇదే వ్యాపారం జరుగుతోంది. గత ప్రభుత్వ పాలనలో మరింత జోరుగా సాగింది. ఇక్కడ సొంతపార్టీ నేతల మధ్యే జగడం జరిగింది. ఇదే స్థితి ప్రస్తుతం రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌లో తెరమీదకు వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పెద్దారెడ్డి సిమెంటు పరిశ్రమలకు బూడిదను సరఫరా చేశారు.

ఇప్పుడు జేసీ వర్గం దందా.. చంద్రబాబు సీరియస్

తాజాగా ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిపత్రి పురపాలక సంఘం ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు బూడిద రవాణా ప్రారంభించారు. ఇక జమ్మలమడుగు ఎమ్మెల్యే నేనే లోకల్.. నాదే హక్కు నినాదంతో ఆదినారాయణరెడ్డి బూడిద తోలకం ప్రారంభించారు. అంతే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయుల బూడిదను తాడిపత్రి పరిసరాల్లోని సిమెంటు పరిశ్రమలకు వెళ్లకుండా జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. ఈ ఫ్లైయాష్ వివాదం ఎట్టకేలకు సచివాలయానికి చేరింది.సీఎం చంద్రబాబు పిలుపుతో జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి సచివాలయానికి వచ్చి సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. జ్వరం వల్ల రాలేనని జేసీ ప్రభాకర్‌రెడ్డి సమాచారం అందించారు. ఫ్లైయాష్ కాంట్రాక్టులో నేతల మధ్య వివాదం కారణంగా కూటమి ప్రతిష్ట దెబ్బతింటుందని ఇప్పటికే చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# విశాఖపట్నంలో సరికొత్త దందా

అమరావతి, విశాఖపట్నంలో మరో సరికొత్త దందా బయటపడింది. కొన్ని ముఠాలు పోలీసుల కళ్లుగప్పి గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు కొత్త మార్గాలను వెతుక్కుంటున్నారు. తాజాగా నగరంలో డ్రైఫ్రూట్స్ మాటున సాగుతున్న గంజాయి అక్రమ రవాణాకు బ్రేకులు వేశారు. ప్రముఖ కొరియర్ సంస్థ ద్వారా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును విశాఖపట్నం రైల్వే పోలీసులు బయటపెట్టారు. విశాఖ నుంచి ఢిల్లీకి 16 కిలోల గంజాయిని రవాణా చేస్తుండగా వికాశ్‌కుమార్ అనే వ్యక్తి రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతడ్ని ప్రశ్నించగా కీలక విషయాలు తెలిశాయి. వికాశ్ కుమార్ కుమార్ అతి తెలివితో గంజాయిని ఎవరికీ అనుమానం రాకుండా ప్యాక్ చేసి, ఆన్‌లైన్‌లో హెూం సర్వీస్ పికప్ బుక్ చేస్తున్నాడు. కొరియర్ సంస్థలు ఒకవేళ ప్యాకింగ్‌లో ఏముందని అడిగితే.. డ్రైఫ్రూట్స్ అని చెబుతుండటంతో నిజమేనని నమ్మి వారు బుక్ చేస్తున్నారు. కొద్దిరోజులుగా గుట్టుగా ఈ వ్యవహారం నడుస్తోంది. విశాఖపట్నం నుంచి పలు ప్రాంతాలకు గంజాయి రవాణా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ గంజాయి అక్రమ రవాణా వెనుక ముఠా ఉన్నట్లు తెలుసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. వికాశ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే రైల్వేస్టేషన్‌లో చేపట్టిన తనిఖీల్లో మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన మహ్మద్ నాదిర్‌షా దగ్గర 8 కిలోలు, బిహార్‌కు చెందిన నితీష్‌కుమార్ దగ్గర 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కొంతకాలంగా గంజాయిని రైళ్లలో తరలిస్తున్నారు. వీరు సాధారణ ప్రయాణికుల్లో లగేజి బ్యాగులతో యాత్రలకు కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్నట్లు నమ్మిస్తున్నారు. విశాఖపట్నం నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలించేందుకు ముఠాలు రైలు మార్గాన్ని ఎంచుకోవటానికి చాలా కారణాల ఉన్నాయి. తక్కువ ఖర్చుతో పాటుగా ఎక్కువ మందిలో నిందితులను పోలీసులు గుర్తించడం కష్టంగా ఉంటుంది. రైలు మార్గంలో అయితే తప్పించుకోవడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఈ ముఠాలు రైలు ఎక్కిన తర్వాత కూడా చాలా తెలివిగా వ్యవహరిస్తాయి. ఆ బ్యాగులను వారున్న చోట కాకుండా తలుపు పక్కన, మరుగుదొడ్లు, సీట్ల కింద ఉంచుతారు, ఇంకొందరు ఒక బోగీలో ఉంచి మరో బోగీలో ప్రయాణిస్తారు. ఎప్పటికప్పుడు ఈ బ్యాగుల్ని గమనిస్తూనే ఉంటారు. పోలీసులు కూడా రైల్వే స్టేషన్‌లలో తనిఖీలను ముమ్మరం చేశారు.

# అమరావతిలో కీలకమైన ఆస్పత్రి, కాలేజీ ఏర్పాటుకు ముందడుగు

అమరావతి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కీలకమైన ఆస్పత్రి, మెడికల్ కాలేజీకి ముందడుగు పడింది. ఏపీ మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల అమరావతిలో ఈఎస్ఐ ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుకు 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఈ మేరకు నెక్కల్లు సమీపంలో సర్వే నంబరు 20లో ఈ-8 రహదారి పక్కన ఉన్న స్థలాన్ని ఈఎస్ఐ, సీఆర్డీఏ అధికారులు పరిశీలించారు. నేషనల్ హైవేకు అనుసంధానం, రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసే విధానం, దగ్గరలో స్థలాలు కేటాయించిన సంస్థల వివరాలను సీఆర్డీఏ అధికారులు ఈఎస్ఐ అధికారులకు వివరించారు. ఈఎస్ఐ ఆస్పత్రికి స్థలం కేటాయించిన ప్రాంతానికి సమీపంలోనే అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతుందని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం రాజధాని సెంట్రల్ పాయింట్‌గా ఉంటుందన్నారు. అమరావతిలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి, వైద్య, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలు నిర్మించాల్సి ఉన్నందున.. భవిష్యత్ అవసరాల కోసం మరో 20 ఎకరాలు కేటాయిస్తే బాగుంటుందనే అంశంపైనా చర్చించారు. ఈ స్థలాన్ని పరిశీలించిన వారిలో ఈ బీమా, వైద్య సేవల డైరెక్టర్ వీ ఆంజనేయ, ఈఎస్ఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, జాయింట్ డైరెక్టర్ జి.జగదీప్ గాంధీ, తహసీల్దారు రవిబాబు, సీఐఎస్ ప్లానింగ్ అధికారి రవితేజలు ఉన్నారు. ఈఎస్ఐకి నాన్ పొల్యూషన్ ఇండస్ట్రియల్ జోన్ పక్కన (బిజినెస్ పార్క్) 20 ఎకరాలను సీఆర్డీఏ కేటాయించింది. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు రహదారి పక్కన ఈ ప్రాంతం ఉంది. త్వరలోనే ఆస్పత్రికి నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. కేంద్రం అమరావతిలో 500 పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆసుపత్రితోపాటుగా 150 పడకల సూపర్ స్పెషాలిటీ పడకలతో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఓకే చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన ఈఎస్ఐ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి.. విభజన తర్వాత తెలంగాణకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ఏపీలో ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.. ఈ మేరకు అమరావతిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఈ ఆస్పత్రి నిర్మాణం, నిర్వహణను ఈఎస్ఐ కార్పొరేషన్‌కే అప్పగిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వ్యయం చేయాల్సిన పని ఉండదు. ఒకవేళ రాష్ట్రమే నిర్వహించాలనుకుంటే ఒప్పందం వ్యయంలో 1/8 వంతు భరించాల్సి ఉంటుంది. రాబోయే రోజుల్లో అమరావతికి కనెక్టివిటీ పెరగనుంది. నేషనల్ హైవేలు, రైలు మార్గాలు కూడా అందుబాటులోకి రాబోతున్నాయి. భవిష్యత్తులో ఐటీ కంపెనీలు, విద్యా సంస్థలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు కూడా వస్తాయి అంటున్నారు. ఆయా సంస్థల్లో ఉపాధి పొందే చిరుద్యోగులు ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు.. ఇలా పలు అంశాలను పరిశీలించి రాష్ట్ర స్థాయి ఆసుపత్రిని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# ఆ రూట్లలలో రైళ్ల దారి మళ్లింపు

అమరావతి,గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని సిమెంట్ నగర్-కృష్ణమ్మ కోన సెక్షన్‌లో, పాణ్యం స్టేషన్ల దగ్గర డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా గుంతకల్లు, గుత్తి మీదుగా వెళ్లే నాలుగు రైళ్లను దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. పూరి-యశ్వంతపూర్ గరీబ్ రథ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (22883)ను డిసెంబరు 6న.. యశ్వంత్‌పూర్-పూరి (22884)ను డిసెంబరు 7న డోన్ స్టేషన్ మీదుగా కాకుండా నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్, అనంతపురం మీదుగా మళ్లిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు.డిసెంబరు 4, 11 తేదీల్లో.. హౌరా-యశ్వంతపూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22831) రైలును.. యశ్వంత్‌పూర్-హౌరా రైలు (22832)ను డిసెంబరు 6, 13 తేదీల్లో గుత్తి-డోన్ సెక్షన్ మీదుగా కాకుండా అనంతపురం, గుత్తి ఫోర్ట్, ఎర్రగుంట్ల, నంద్యాల స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్టు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. రైలు ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. మరోవైపు రైల్వే ఏసీ కోచ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసే బెడ్‌షీట్లు, పిల్లో కవర్స్, టవల్స్ ను ఏ రోజుకు ఆ రోజే శుభ్రం చేసి అందిస్తామని అధికారులు తెలిపారు. రైల్వే కోచ్‌లో తిరుపతి నుంచి అందిస్తున్న బెడ్ షీట్లతోపాటు పిల్లో కవర్స్, టవల్స్ శుభ్రంగా లేవని, వారం రోజులకు ఒకసారి మార్పు చేస్తున్నారంటూ కొందరు ప్రయాణికులు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సూచనల మేరకు పలువురు అధికారులు తిరుపతిలోని చింతలచేనులో రైల్వేకి చెందిన మెకనైజ్డ్ ల్యాండ్రీని అధికారులు

# మెట్రో ప్రయాణికులకు భారీ శుభవార్త

హైదరాబాద్, హైదరాబాద్‌లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజల ప్రయాణ విధానాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా, వేగవంతమైన రవాణా అందించాలనే లక్ష్యంతో ఎల్ అండ్ టీ సంస్థ ఈ మెట్రో ప్రాజెక్టును ప్రారంభించింది. మొదటి నుంచే మెట్రో రైలు సేవలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. అయితే, మెట్రో ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా, హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య మాత్రం తగ్గడం లేదు. ఆఫీసులకు వెళ్లే వారు శీతాకాలంలో రోడ్డు ట్రాఫిక్ సమస్యలను తగ్గించుకోవడంలో మెట్రోను ఆశ్రయిస్తున్నారు. మెట్రోలో ప్రయాణం తక్కువ ఖర్చుతో పాటు ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో, రెగ్యులర్ మెట్రో ప్రయాణికులను మరింత ప్రోత్సహించేందుకు ఎల్ అండ్ టీ మెట్రో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. డిసెంబర్ 1 నుండి ఫిబ్రవరి 28 వరకు, మూడు నెలల కాలానికి ప్రయాణాలను ఆధారంగా తీసుకొని ప్రయాణికులకు ప్లాటినం, గోల్డ్, సిల్వర్ బ్యాండ్లు అందించనున్నట్లు అధికారులు ప్రకటించారు. 51 ట్రిప్పుల కన్నా ఎక్కువగా ప్రయాణించిన వారికి ప్లాటినం బ్యాండ్ అందజేస్తారు. 36-50 ట్రిప్పుల మధ్య ప్రయాణిస్తే గోల్డ్ బ్యాండ్ ఇస్తారు. 21-35 ట్రిప్పుల ప్రయాణానికి సిల్వర్ బ్యాండ్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మెట్రో ప్రయాణాన్ని ప్రజల రోజువారీ జీవితంలో భాగం చేయడమే ఎల్ అండ్ టీ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం. మెట్రో సేవల వినియోగం పెరిగితే, రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. మెట్రో సేవలు వేగం, సౌకర్యం, విశ్వసనీయతలో ముందంజలో ఉంటూ, హైదరాబాద్ నగరాన్ని కొత్త గమ్యానికి తీసుకెళ్తున్నాయి. ఆఫర్ నేటి నుంచే అమల్లోకి రానుంది.

# ట్రాయ్ కొత్త రూల్స్ అమలు

ప్రతి నెల ప్రారంభంలో ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంటుంది. అవి ధరలు పెంపు లేదా తగ్గింపు అవ్వచ్చు. ఏదైనా నిబంధనలు, పాలసీలు, రూల్స్ మార్పులు ఇలా ఏదైనా అవ్వచ్చు. కానీ కీలక మార్పులు మాత్రం పక్కాగా ఉంటాయి. ఈ ఏడాది ఆఖరి నెలలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. కొన్ని అంశాలకు సంబంధించిన నిర్ణయాలను కొత్త నెల ప్రారంభం రోజునే అమలులోకే వస్తాయి. అయితే వచ్చే నెల కోసం పలు ఆర్థిక అంశాలపై కీలక మార్పులు చోటు చేసుకోబోతున్నాయి.దేశీయ టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ డిసెంబర్ 1 నుంచి కొత్త రూల్స్ తీసుకొస్తోంది. అదే 'ట్రేసబిలిటీ రూల్' దీని ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ వంటి వాటిని అరికట్టేందుకు కమర్షియల్ మెసేజ్‌లను గుర్తించేందుకు కొత్త ఓటీపీ ట్రేసబిలిటీ రూల్‌లు తీసుకొస్తోంది. ఇకపై ఏపీకే ఫైల్స్ , మోసపూరిత మెసేజ్‌లు రాకుండా టెలికాం సంస్థలు వాటిని నిరోధిస్తాయి. అయితే, ఈ కొత్త రూల్స్ ద్వారా బ్యాంకింగ్ వంటి ముఖ్యమైన లావాదేవీల ఓటీపీలు ఆలస్యమవుతాయనే ఆందోళన పెరిగింది. కానీ, ట్రాయ్ నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటామని, మీ సేవలు ఆలస్యం కాకుండా చూస్తామని స్పష్టం చేసింది. దీనితో ఫేక్ ఓటీపీలు రాకుండా ప్రజలు మోసపోకుండా ఉండడానికి ఈ కొత్త రూల్ తీసుకొస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ చాయలెంటే రూ. 50 చెల్లించాలి. అది కేవలం గడువు తేదీ దాటితే, ఇటీవల యుఐడీఏ ఆధార్ కార్డులో వివరాలను ఉచితంగా అప్డేట్ చేసుకోమని చెప్పింది. అందుకోసం డిసెంబర్ 14వ తేదీ వరకూ గడువుని ప్రకటించింది. గడువు తేదీ లోపు ఆధార్ కార్డులో పేరు, అడ్రస్, చిరునామా వంటి వివరాలను ఫ్రీగా చేసుకోవచ్చు. కానీ తేదీ దాటితే ఈ ఉచిత అప్‌డేట్ ఆప్షన్ పోతుంది. ఆ తర్వాత ఒక్కో ట్రాన్సాక్షన్‌కి రూ.50 అపైన చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి తొందరగా అప్‌డేట్ చేసుకోమని యుఐడీఏ చెప్తోంది. ప్రతి ఏటా ఒక వ్యక్తి లేదా సంస్థ ఆదాయాన్ని, వ్యయాలను, పన్నులను మూడవ వర్గీకరణలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలి. ఈ ప్రక్రియ ద్వారా, ప్రతి వ్యక్తికే ఆదాయాన్ని ప్రకటించడం, పెట్టుబడులు మరియు ఖర్చులను గణించడం, తద్వారా వారి ఆదాయ పన్నును సరిగ్గా చెల్లించడం జరుగుతుంది. ఇది ఒక పన్ను చెల్లింపుదారుని ఆర్థిక స్థితిని అంచనా వేయడానికి ప్రభుత్వానికి ఉపయోగపడుతుంది. ఐటీ రిటర్న్‌ను సరిగ్గా సమయానికి ఫైల్ చేయడం అత్యంత ముఖ్యం, ఎందుకంటే ఆలస్యం అయినా, లేదా తప్పుగా ఫైల్ చేసినా, దానికి జరిమానాలు, పన్ను తిరిగి పొందడంలో ఇబ్బందులు లేదా ఇతర పరిమితులు వచ్చే అవకాశం ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బిలేటెడ్ ఐటీఆర్ దాఖలు చేసేందుకు డిసెంబర్ 31 వరకు ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ గడువు ఇచ్చింది. దీనినే బిలేటెడ్ ఐటీ రిటర్న్ అంటారు. పెనాల్టీతో ఫైల్ చేసేందుకు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత అయితే ఫైల్ చేయడానికి లేదు. ఫైల్ చేయనివారు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది.

# నేతలు తిరుగుబాటు..

అమరావతి,ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కష్టాలు అన్ని ఇన్ని కావు అన్నట్లు తయారైంది. ఓవైపు తండ్రి , దివంగత వైఎస్ఆర్‌లాగా కాంగ్రెస్‌ని ఒంటి చేత్తో నడపాలని పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల చూస్తున్నారు. అయితే రాష్ట్రంలోని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆమెకు ఏ మాత్రం సహకరించడం లేదంట. పైగా పార్టీలోని పలువురు నేతలు షర్మిల ఒంటెద్దు పోకడ పోతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఆమెపై హైకమాండ్‌కి ఫిర్యాదులు కూడా వెళ్తున్నాయి. అయినా ఢిల్లీ పెద్దలు పట్టించుకోకపోవడంపై కొందరు నేతలు తీవ్ర అసంతృప్తితో కనిపిస్తున్నారు.ఏపీలో తిరిగి పుంజుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీని బాలారిష్టాలు వీడేలా కనిపించడం లేదు. ఏపీలో ఎలాగైనా కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలని పార్టీ జాతీయ అధినాయకత్వం ఏరికోరి వైఎస్ షర్మిలకు పీసిసి పగ్గాలు అప్పగించింది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని పూర్తిగా కోల్పోయింది. దాంతో పార్టీ సీనియర్లు చెల్లాచెదురు పుట్టకొకరు అయ్యారు. విభజన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు దక్కించుకోలేకపోయిన కాంగ్రెస్ పూర్తిగా ఉనికి కోల్పోయింది.గత ఎన్నికల ముందు తెలంగాణ రాజకీయాల్లో ఉన్న వైఎస్ షర్మిలను ఏపీకి తీసుకొచ్చిన కాంగ్రెస్ హైకమాండ్ పీసీసీ పగ్గాలు కట్టబెట్టింది . దివంగత వైఎస్ కుమార్తె చరిష్మాతో ఏపీలో ఉనికి చాటుకోవాలని కాంగ్రెస్ పెద్దలు భావించారు. అయితే ఆమె పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడు అడుగులు ముందుకి నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితి తయారైందంటున్నారు. షర్మిల సీనియర్లను కలుపుకొని వెళ్లడంతో పాటు, కొత్త రాష్ట్ర కమిటీని నియమించి సంస్థాగతంగా పార్టీ పునర్నిర్మాణం దిశగా అడుగులు వేస్తారని భావిస్తే ఏపీ కాంగ్రెస్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయంటూ ఆ పార్టీ సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పీసీసీ అధ్యక్షురాలుగా షర్మిల బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆమె చుట్టూనే ఏపీ కాంగ్రెస్ రాజకీయాలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో షర్మిల తానే స్వయంగా పోటీ చేసి దూకుడు ప్రదర్శించిన కాంగ్రెస్ బోణీ చేయడం కాదుకదా కనీసం డిపాజిట్లు దక్కించుకోలేకపోయింది.

# భారత్‌లో వేగంగా తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు



న్యూఢిల్లీ,ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం మనదని గొప్పగా చెప్పుకుంటాం. 'యువ భారతం'గా మన దేశాన్ని పిలుచుకుంటాం. ఒళ్లొంచి పని చేసే యువ జనాభా ఎక్కువగా ఉండటమే భారత్ బలం. అయితే, ఈ బలం భవిష్యత్తులో ఉండకపోవచ్చు. ఇప్పటి 'యువ భారతం' మూడు దశాబ్దాల తరువాత 'వృద్ధ భారతం'గా మారబోతోంది. జనాభా రేటు తగ్గిపోయింది, వృద్ధుల జనాభా పెరగడం వల్ల ఇప్పుడు జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఆ దేశాల అభివృద్ధికి ఇది అడ్డంకిగా మారుతోంది. ఇదే పరిస్థితి 30 ఏండ్ల తర్వాత మన దేశానికీ ఎదురుకాబోతోంది. ముఖ్యంగా దక్షిణాది చిత్రాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండనుంది.

భారీగా పడిపోయిన సంతానోత్పత్తి రేటు

ఒక మహిళ 15 ఏండ్ల నుంచి 49 ఏండ్ల మధ్య వయసులో జన్మనిచ్చే పిల్లల సంఖ్య సగటున సంతానోత్పత్తి రేటుగా లెక్కిస్తారు. 1950లో దేశంలో సంతానోత్పత్తి రేటు 6.18గా ఉండేది. అధిక జనాభా కారణంగా ఆహార కొరత వంటి సమస్యలు తలెత్తడంతో 1951 నుంచి కుటుంబ నియంత్రణ అమలు చేయబడింది. ఇద్దరిని మించి కన వద్దని అవగాహన కల్పించారు. క్రమంగా సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వచ్చింది. ఈ తగ్గుదల మరీ ఎక్కువ కావడమే ఇప్పుడు సమస్యగా మారింది. జనాభా తగ్గాలంటే సంతానోత్పత్తి 2.1గా ఉండాలి. మన దేశంలో సంతానోత్పత్తి రేటు వేగంగా ఈ రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగువకు పడిపోతోంది. 36 నివేదికలు, కేంద్రపాలిత ప్రాంతాలు 31లో సంతాన రేటు 2.1కు, అంతకు దేశంలో దిగువకు పడిపోయింది. బీహార్, యూపీ, జార?ండ్, మేఘాలయ, మణిపూర్ మాత్రమే ఎగువన ఉన్నాయి. 2019-21కి దేశంలో సంతానోత్పత్తి రేటు 2.0తో రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగువకు తగ్గినట్టు కేంద్రం.

తేరుకోకపోతే సంక్షోభమే

భారత్‌లో సంతానోత్పత్తి ఇలాగే కొనసాగితే 2050 నాటికి 1.29కు పడిపోతుందని ఇటీవల లాన్‌సెట్ నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. అంటే, మరో మూడు దశాబ్దాల్లో దేశంలో వృద్ధుల జనాభా భారీగా పెరగడంతో పాటు మొత్తం జనాభా సంఖ్య తగ్గిపోతోంది. ఇదే జరిగితే దేశానికి బలంగా ఉన్న శ్రామిక శక్తి తగ్గిపోయి ఆర్థిక వృద్ధి కుంటుపడుతుంది. వృద్ధుల జనాభా పెరగడం వైద్య సేవలు, పింఛన్ల వ్యవస్థపై భారం పెంచుతుంది. కాగా, జీవన వ్యయం పెరగడం వల్ల ఒకరిని మించి పిల్లలను కనేందుకు యువ దంపతులు వెనకాడటం సంతానోత్పత్తి రేటు తగ్గడానికి ప్రధాన కారణం. వివాహాలు ఆలస్యంగా చేసుకుంటుండటం, మానసిక ఒత్తిడి, జీవనశైలి, వాతావరణ సంబంధ సమస్యల వల్ల వంధ్యత్వం పెరగడం కూడా కారణమే. భారత్‌లో ఇప్పటికీ యువ జనాభా ఎక్కువ కాబట్టి వెంటనే అప్రమత్తమైతే భవిష్యత్తులో తలెత్తే సంక్షోభాన్ని నివారించేందుకు నిపుణులు సూచిస్తున్నారు.

### కెన్ స్టార్ షిప్ ను ఎందుకు వదిలేశారు?

అమరావతి,కాకినాడ పోర్ట్ నుంచి పెద్ద ఎత్తున బియ్యం అక్రమంగా తరలిపోతోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మండిపడ్డ సంగతి తెలిసిందే. పవన్ కాకినాడ పర్యటన గురించి వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని స్పందిస్తూ... స్టెల్లా షిప్ ను తనిఖీ చేసిన పవన్ కల్యాణ్ కెన్ స్టార్ షిప్ ను ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు.

# భారత్‌చైనా సరిహద్దులో ఉద్రిక్తతలు తగ్గేనా?

న్యూఢిల్లీ,భారత్ 2019లో కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఉపసంహరిస్తూ రాజ్యాంగంలో ని 370 అధికరణాన్ని రద్దు చేసినప్పుడు చైనా ఆ చర్యను యుఎన్ భద్రతా మండలిలో ఖండించింది. కశ్మీర్‌లో ఎక్కువ ఎత్తులోని లడఖ్ అంతర్భాగంగా ఉండేది. దానిలో కొన్ని ప్రాంతాలను చైనా తనవిగా చెప్పుకుంటున్నది, ఆ భూభాగాల్లో మొదటిదైన అక్సాయ్ చిన్ చైనా పరిపాలనలో ఉన్నది. కానీ, అది తనదని భారత్ వాదిస్తోందిబీ ఆ ప్రాంతంలో అధిక భాగం నివాసులు లేని ఎక్కువ ఎత్తైన బంజరు భూమి కానీ అంచులో కొంత మేరకు పచ్చిక భూములతో ఉన్నది. అది కశ్మీర్, టిబెట్, గ్జిన్‌జియాంగ్ కూడలిలో ఉన్నది, దాని మీదుగా చైనా గ్జిన్‌జి యాంగ్ టిబెట్ రహదారి వెళుతోంది.సుదీర్ఘ కాలం ప్రతిష్టంభన అనంతరం తూర్పు లడఖ్‌లోను, అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ రంగంలోను సేనల ఉపసంహరణలో చైనా, భారత మిలిటరీలు గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి. ఉభయ దేశాల రక్షణ శాఖ మంత్రులు నవంబర్ చివరి వారంలో ఫలప్రదమైన సమావేశం నిర్వహించి, సరిహద్దులో ఉద్రిక్తతలు తగ్గింపునకు అంగీకరించారు. నాలుగు సంవత్సరాలకు పైగా ప్రతిష్టంభన అంతానికి భారత్‌తో సరిహద్దు ఒప్పందం అమలులో 'గొప్ప పురోగతి' సాధించినట్లు చైనీస్ మిలిటరీ నవంబర్ 23న వెల్లడించింది. రెండు దేశాల రక్షణ శాఖ మంత్రుల మధ్య ఇటీవలి సమావేశం సకారాత్మకమైనదని, నిర్మాణాత్మకమైనదని చైనా మిలిటరీ అభివర్ణించింది. అయితే, రెండు పక్షాలు ఒప్పందం వివరాలను వెల్లడించలేదు.తూర్పు లడఖ్‌లో ఎల్ఎసి పొడుగునా గస్తీ, సేనల ఉపసంహరణపై భారత్ చైనా ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ధ్రువీకరించి, వివిధ ద్వైపాక్షిక చర్చల యంత్రాంగాల పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేశారు. గల్వాన్ లోయలో 2020లో ప్రాణాంతక మిలిటరీ సంఘర్షణ వల్ల దెబ్బతిన్న సంబంధాలను తిరిగి మామూలు స్థితికి తీసుకువచ్చే యత్నాలకు అది సూచిక అయింది. 2020లో సంఘర్షణ కొన్ని దశాబ్దాల్లో రెండు ఇరుగుపొరుగు దేశాల మధ్య అధ్వాన ఘర్షణగా మారింది. ఆ ఘర్షణలో కనీసం 20 మంది భారతీయ జవాన్లు, నలుగురు చైనా జవాన్లు మృతి చెందారు. 2019 అక్టోబర్ తరువాత మోడీ, జిన్‌పింగ్ బ్రిక్స్ కజాన్ సమ్మిట్ సందర్భంగా గత అక్టోబర్ 23న తమ తొలి ఇష్టాగోష్టి నిర్వహించారు.ఉభయ నేతలు 2022లో బాలిలో జి20 సమ్మిట్‌లో విడిగా భేటీ అయ్యారు. కొన్ని నెలల అనంతరం, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు ఆ సమావేశంలో వారు 'ఏకాభిప్రాయానికి' వచ్చినట్లు చైనా తెలియజేసింది. జోహన్నెస్‌బర్గ్‌లో 2023 బ్రిక్స్ సమ్మిట్ సందర్భంగా ఆ ఇద్దరు అధినేతలు కూడా లాంఛనప్రాయంగా భేటీ అయ్యారు. సేనల ఉపసంహరణకు, ఉద్రిక్తల తగ్గింపునకు ముమ్మరంగా కృషి చేయాలని వారు అంగీకరించారు. 2023లో కజక్‌స్తాన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సమ్మిట్ సందర్భంగా భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యిని కలుసుకుని, చర్చల స్థాయి పెంపునకు అంగీకరించారు.భారత్ చైనా సంబంధాలు దశాబ్దాల పాటు ఉద్రిక్తతల ప్రభావానికి గురయ్యాయి సరిగ్గా నిర్వచించని, 3440 కిమీ నిడివి వివాదాస్పద సరిహద్దు అందుకు మూల కారణం. సరిహద్దు పొడుగునా నదులు, సరస్సులు, హిమ వర్షాలు తరచు సరిహద్దు రేఖలను మారుస్తుండేవి, దీనితో అనేక చోట్ల సైనికులు ముఖాముఖి తలపడుతుండేవారు, అది సంఘర్షణకు దారి తీస్తుండేది. ఆసియాలో వలసవాద విధానం చారిత్రక పర్యవసానాల, స్పష్టమైన చారిత్రక సరిహద్దు గుర్తింపులు లేకపోవడం వల్ల రెండు దేశాల మధ్య భూవివాదాలు తలెత్తుతుండేవి.భారత్, చైనా 1962లో యుద్ధం చేశాయి. దానిలో భారత్ భారీ ఓటమికి గురైంది. అప్పటి నుంచి రెండు పక్షాల మధ్య పలు సంఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. చైనా సేనలు పశ్చిమాన లడఖ్‌లో భారతీయ సరిహద్దు కేంద్రాలపైన దాడి చేసి, తూర్పున మెక్‌మహోన్ రేఖను దాటాయి. సిక్కిం ప్రాంతంలో అంగీకృత సరిహద్దు ఉన్నప్పటికీ 1967లో ఆ ప్రాంతంలో స్వల్పంగా సరిహద్దు ఘర్షణ జరిగింది. 1987లోను, 2013లోను వాస్తవ నియంత్రణ రేఖలు (ఎల్ఏసి)పై సంఘర్షణలు జరిగే అవకాశాన్ని తప్పించారు. 2017లో భూటాన్, చైనా మధ్య సరిహద్దులో భూటాన్ నియంత్రిత ప్రాంతంలో వివాదం సమయంలో భారత్, చైనా జవాన్లకు గాయాల తరువాత ఆ రెండింటి మధ్య వివాదాన్ని జయప్రదంగా పరిహరించారు. 2020లో అనేక ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అది 2020 జూన్‌లో అనేక మరణాలకు గాయాలకు దారి తీసింది.భారత్ 2019లో కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఉపసంహరిస్తూ రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని రద్దు చేసినప్పుడు చైనా ఆ చర్యను యుఎన్ భద్రతా మండలిలో ఖండించింది. కశ్మీర్‌లో ఎక్కువ ఎత్తులోని లడఖ్ అంతర్భాగంగా ఉండేది. దానిలో కొన్ని ప్రాంతాలను చైనా తనవిగా చెప్పుకుంటున్నది, ఆ భూభాగాల్లో మొదటిదైన అక్సాయ్ చిన్ చైనా పరిపాలనలో ఉన్నది. కానీ, అది తనదని భారత్ వాదిస్తోందిబీ ఆ ప్రాంతం లో అధిక భాగం నివాసులు లేని ఎక్కువ ఎత్తైన బంజరు భూమి కానీ అంచులో కొంత మేరకు




పచ్చిక భూములతో ఉన్నది. అది కశ్మీర్, టిబెట్, గ్జిన్‌జియాంగ్ కూడలిలో ఉన్నది, దాని మీదుగా చైనా గ్జిన్‌జియాంగ్ టిబెట్ రహదారి వెళుతోంది.మరొక వివాదాస్పద భూభాగం ఒకప్పుడు ఈశాన్య సరిహద్దు సంస్థ (నీఫా)గా పేర్కొన్న ప్రస్తుతం అరుణాచల్‌ప్రదేశ్‌గా ఉన్న ప్రాంతంలో మెక్‌మహోన్ రేఖకు దక్షిణంగా ఉన్నది. దానిని భారత్ పాలిస్తోంది, కానీ చైనా తనదిగా పేర్కొంటుంటుంది. 1914 సిమ్లా కన్వెన్షన్‌లో భాగంగా బ్రిటిష్ ఇండియా, టిబెట్ మధ్య మెక్‌మహోన్ రేఖపై ఒప్పందం జరిగింది, అయితే, చైనా దానిని ఎన్నడూ ధ్రువీకరించలేదు. చైనా మెక్‌మహోన్ రేఖ ఒప్పందాన్ని తిరస్కరిస్తున్నది, సిమ్లా కన్వెన్షన్‌పై సంతకాలు జరిగినప్పుడు టిబెట్ స్వతంత్ర దేశం కాదని చైనా వాదిస్తోంది. గ్రేట్ బ్రిటన్, చైనా, టిబెట్ మధ్య సిమ్లా కన్వెన్షన్ 1913, 1914లో సిమ్లాలో చైనా రిపబ్లిక్, టిబెట్, గ్రేట్ బ్రిటన్ ప్రతినిధులు సంప్రదింపులు జరిపిన టిబెట్ హోదాకు సంబంధించిన అస్పష్టమైన సంధి. టిబెట్‌ను 'ఔటర్ టిబెట్', 'ఇన్నర్ టిబెట్'గా విభజించాలని సిమ్లా కన్వెన్షన్ ప్రతిపాదించింది. సుమారుగా ఉత్సాంగ్, పశ్చిమ ఖామ్‌తో కూడిన ఔటర్ టిబెట్ 'చైనా ఆధిపత్యం కింద లాసాలో టిబెట్ ప్రభుత్వం అధీనంలో' కొనసాగుతుంది, కానీ, దాని పరిపాలనలో చైనా జోక్యం చేసుకోదు. సుమారుగా అందో, తూర్పు ఖామ్‌తో సమానమైన 'ఇన్నర్ టిబెట్' చైనా ప్రభుత్వం పరిధిలో ఉంటుంది. టిబెట్, చైనా మధ్య సరిహద్దును, టిబెట్, బ్రిటిష్ ఇండియా మధ్య సరిహద్దును కూడా కన్వెన్షన్ నిర్వచించింది. రెండవది మెక్‌మహోన్ రేఖగా పరిగణన పొందింది.మిలిటరీ వివాదం కూడా రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను దెబ్బ తీసింది. దేశంలో చైనా పెట్టుబడులపై తన నిశిత పరిశీలనను ఢిల్లీ హెచ్చించింది, టిక్‌టాక్ సహా పాప్యులర్ చైనా యాప్‌లు పెక్కింటిని నిషేధించింది. చైనాకు సరాసరి విమాన సర్వీసులను కూడా భారత్ నిలిపివేసింది. చైనీస్ సంస్థల పెట్టుబడులపై పరిశీలనను భారత్ కట్టుదిట్టం చేయడమే కాకుండా పెద్ద ప్రాజెక్టులను నిలిపివేసింది. సరిహద్దు సంఘర్షణల దరిమిలా చైనీస్ పెట్టుబడులను భారత్ నిశితంగా పరిశీలిస్తుండడం వల్ల ఆటోమొబైల్, బ్యాటరీ తయారీ సంస్థ బివైడి ఆటో కంపెనీ లిమిటెడ్, గ్రేట్ వాల్ మోటార్ వంటి చైనీస్ బహుళ జాతీయ తయారీ సంస్థల నుంచి బిలియన్ల డాలర్ల మేరకు పెట్టుబడులు మళ్లాయి. అయినప్పటికీ, 2020 సరిహద్దు ఘర్షణ దరిమిలా చైనా నుంచి భారత్ దిగుమతులు 56 శాతం మేర పెరిగాయి. బీజింగ్‌తో న్యూఢిల్లీ వాణిజ్య లోటు 85 బిలియన్ డాలర్లకు దాదాపుగా రెట్టింపు అయింది. చైనా ఇప్పటికీ భారత్‌కు సరకుల వనరుగా ఉంటున్నది, నిరుడు అతి పెద్ద పారిశ్రామిక ఉత్పత్తుల సరఫరాదారుగా ఉన్నది.ప్రభుత్వం, ఆర్మీ చెబుతున్నదానికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని రక్షణ పరిశీలకులు అంటున్నారు. భారత్ చైనా మధ్య కుదిరిన ఒప్పందం 2020 ముందునాటి ప్రాంతంలో ఉన్న యథాతథా స్థితికి తిరిగి వెళ్లడం కిందకు రాదని ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. విదేశాంగ మంత్రిత్వశాఖ, ఆర్మీ చీఫ్ ప్రకటనల మధ్య విరుద్ధ వైఖరులు సదరు ఒప్పందంపై అనుమానాలకు కారణాలు అని పరిశీలకులు అంటున్నారు. ఉద్రిక్తతలు తగ్గలేదని, అది సేనల ఉపసంహరణ మాత్రమేనని రక్షణ పరిశీలకులు అనేక మంది చెప్పారు. అంటే దెప్సాంగ్, దెమ్చోక్‌లలో ఇక ఎంత మాత్రం ఘర్షణలు ఉండవన్నమాట. 2020లో తాము ఆక్రమించుకోవడానికి వచ్చిన ప్రాంతాన్ని చైనా ఖాళీ చేసిందని దాని అర్థం కాదు.ఆ ప్రాంతాల్లో గస్తీకి భారత్‌ను వారు అనుమతించారని మాత్రమే దాని అర్థం. 2017లో డోక్లామ్ ప్రతిష్టంభన తరువాత చైనీస్ సైన్యం ఆ ప్రాంతంలో శాశ్వత ఉనికిని సాధించడం చూశాం. ప్రధాని సంక్షోభంలో సమర్థంగా వ్యవహరించారని, ప్రతిష్టంభన సంక్షోభం ఇప్పుడు ముగిసిందని, దాని వల్ల ప్రతిపక్షాల నుంచి రాజకీయ ఇరకాట స్థితిని ఆయన తప్పించుకోవచ్చునని ప్రత్యర్థులకు చూపడమే ఆ ప్రకటనకు కారణమని రాజకీయ పరిశీలకుల్లో ఒక వర్గం అంటున్నది. చైనా అసలు ఉద్దేశం గురించి ప్రతిపక్షాలు, ప్రజల భయాందోళనలు పరిహరించేందుకు, శక్తిమంతమైన పొరుగు దేశంతో వ్యవహరించడంలో మోడీ ప్రభుత్వ దౌత్యబలాన్ని చూపేందుకు చైనా ప్రభుత్వంతో సేనల ఉపసంహరణ ఒప్పందం పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించాలి.

# డీప్‌ఫేక్‌ను అడ్డుకోవాల్సిందే..

హైదరాబాద్,మారిన టెక్నాలజీతో పాటు మోసాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకొని డీప్ ఫేక్ వీడియోలను రూపొందిస్తూ కొందరు ఫేక్ వీడియోలను తయారు చేస్తున్నాయి. అయితే ఇలాంటి వీడియోలను అడ్డుకునే అవసరం వచ్చిందని ప్రముఖ పాత్రికేయుడు, ఫ్యాక్ట్ చెక్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి చెప్పుకొచ్చారు.ప్ ఫేక్ ల వల్ల విపరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, మంచి కోసం ఉపయోగించాల్సిన ఏఐ టెక్నాలజీలను చెడు కోసం వినియోగిస్తున్నారని ప్రముఖ పాత్రికేయుడు, ఫ్యాక్ట్ చెక్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి హైదరాబాద్ లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో డేటా సైన్స్ సమిట్ కార్యక్రమంలో మాట్లాడారు. ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, ఏఐ నిపుణులు నవంబర్ 29న నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థులను దెబ్బతీయడం కోసం డీప్ ఫేక్ లను ఉపయోగిస్తూ ఉన్నారని, ఏఐ ద్వారా ముఖాలను మార్చడం, సెలెబ్రిటీల వాయిస్ తో ఇతర వ్యాఖ్యలు చేసేలా ఏఐ ద్వారా సృష్టించడం జరుగుతూ ఉన్నాయన్నారు సుధాకర్ ఉడుముల. సినీ నటుల దగ్గర నుంచి రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారులు, ఎవరినైనా సరే ఈ డీప్ ఫేక్ ల ద్వారా ఫేక్ వార్తలను సృష్టించడం వీలవుతుంది. ఒకప్పుడు డీప్ ఫేక్ లను గుర్తించడం కాస్త సులువుగా ఉండేది.. కానీ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, సాఫ్ట్ వేర్ కారణంగా ఏది డీప్ ఫేక్, ఏది ఒరిజినల్ అని కనుగొనడం కష్టంగా మారిపోతోంది. ఏఐని మంచి కోసం ఉపయోగించకుండా చెడు కోసం ఉపయోగిస్తూ ఉండడమే ఈ పరిణామాలకు కారణమవుతోందన్నారు. సెలెబ్రిటీల పరువు తీయడానికి, కొందరిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో దాడులు చేయడానికి, మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ఈ డీప్ ఫేక్ లను ఉపయోగిస్తూ ఉన్నారు. డేటా సైన్స్ సమ్మిట్‌ను బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ గారెత్ ఓవెన్ ప్రారంభించారు. కీనోట్ స్పీకర్ గా లారా బాల్డ్విన్, దక్షిణాసియా సైబర్ లీడ్, బ్రిటిష్ హై కమిషన్ వ్యవహరించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియా నుండి మెయిన్ స్ట్రీమ్ మీడియాలోకి వచ్చేయడం కూడా ఆందోళన కలిగిస్తోంది. దీనిపై ప్రముఖ సోషల్ మీడియా సంస్థలు ఫేస్ బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ కూడా చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సోషల్ మీడియా సైట్స్ 'ఇన్ బిల్ట్ డీప్ ఫేక్ డిటెక్షన్ అల్గారిథమ్' ను తీసుకుని వస్తే వీటిని కట్టడి చేయడం సులభం అవుతుంది. సోషల్ మీడియా ద్వారా ఈ డీప్ ఫేక్ వీడియోలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి కాబట్టి బాధ్యత తీసుకోవాల్సింది కూడా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లదే. ఏఐ ని రెగ్యులేట్, ఎడ్యుకేట్, డిటెక్ట్ విషయంలో సమిష్టి కృషి అవసరం. భారతదేశంలో తప్పుడు సమాచార వ్యాప్తిని అడ్డుకోవడం కోసం ఫ్యాక్ట్ చెకర్లు మిస్ ఇన్ఫర్మేషన్ కాంబాట్ అలయెన్స్ ను స్థాపించారు. ఇందులో భాగంగా డీప్ ఫేక్ అనాలసిస్ యూనిట్ ను కూడా తీసుకొచ్చారు. ఎవరికైనా డీప్ ఫేక్ మీద అనుమానాలు ఉంటే ఈ యూనిట్ కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చు. భారత్ లో ఫ్యాక్ట్ చెకింగ్ కు సరైన తోడ్పాటును అందించడం లేదు. మీడియా లిటరసీలో భాగంగా డీప్ ఫేక్ అంటే ఏమిటి, అవి ఎలాంటి ప్రమాదాలకు కారణమవుతాయి లాంటి వివరాలను అందించే కార్యక్రమాలను ప్రభుత్వాలు చొరవ తీసుకుని ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఉంది. లావోస్, కంబోడియా లాంటి దేశాల్లో కూర్చొని భారతదేశంలోని పిల్లలు కిడ్నాప్ అయ్యారు, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కున్నారు అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. సైబర్ నేరగాళ్లు డీప్ ఫేక్ ఆడియో, వీడియోలను వాడుతూ మోసాలకు తెగబడుతూ ఉన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. డీప్ ఫేక్ లు ఎన్నో మోసాల్లో భాగమయ్యాయి, మీడియాలోకి చొచ్చుకొస్తున్నాయి. ఎన్నికల ఫలితాలను మార్చే ప్రమాదం కూడా ఉంది. డీప్ ఫేక్ లను వాడి అసభ్యకరమైన వీడియోలను కూడా సృష్టిస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా మన వీడియోలను ఎవరైనా డీప్ ఫేక్ చేశారా అని కూడా తెలుసుకోవాల్సిన దౌర్భాగ్యం మనకు వచ్చింది. ముఖ్యంగా మహిళలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. డీప్ ఫేకింగ్ రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమవుతుంది. ఆర్థికంగా కూడా చాలా ఎంతో మందికి ఇబ్బందులు ఎదురవుతాయి. డీప్ ఫేక్ కారణంగా అటు మంచి, ఇటు చెడు.. రెండూ ఉన్నాయి. రజనీకాంత్ హీరోగా నటించిన వేట్టయాన్ సినిమాలో మలేషియా వాసుదేవన్ పాడినట్లుగా ఏఐ ద్వారా సృష్టించారు. ఇది వాసుదేవన్ కుటుంబం అంగీకారంతో జరిగింది. కానీ అన్ని సందర్భాల్లో ఇలాగే ఉండదు. కొందరు దురుద్దేశపూరితంగా కూడా వ్యవహరించే అవకాశం ఉంది. మంచి ఉద్దేశ్యంతో చేస్తే ఎలాంటి తప్పు లేదని గుర్తుంచుకోవాలి. ఎంటర్టైన్మెంట్ ఇండస్ట్రీలో ఏఐ ద్వారా ఎన్నో సంచలనాలు సృష్టించవచ్చు. ఏఐను ఉపయోగించడంలో ప్రవర్తనా నియమావళి చాలా ముఖ్యం. ఏఐ మేకర్స్ కూడా ఇన్ బిల్ట్ డిటెక్షన్ ను తీసుకుని రావాలి. మీడియాకు చెందిన వారికి కూడా వీటిపై సరైన అవగాహన కల్పించాలి. డీప్ ఫేక్ విజువల్స్ ఉండే లోపాలను ప్రతి ఒక్కరూ గుర్తించేలా అవగాహన తీసుకుని రావాలి. హైవ్, హియా వంటి డీప్ ఫేక్ టూల్స్ గురించి తెలియజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియా దిగ్గజాలు, ప్రభుత్వాలు, ఫ్యాక్ట్ చెకర్స్ కలిసి పోరాటం చేస్తేనే డీప్ ఫేక్ తో సమస్యలను అడ్డుకోడానికి వీలవుతుంది.

# మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ యాక్ట్

మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసులు ఆంక్షలు విధించింది. శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. సోమవారం (డిసెంబర్ 2) నుంచి జనవరి 1 వరకు జిల్లా అంత ఆమలులో ఉండనున్నాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి బహిరంగ సమావేశాలు కానీ, ఊరేగింపులు, ధర్నాలు జరుపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఎలాంటి ఆయుధాలను వాడకూడదని చెప్పారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధ నలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. స్వేచ్ఛ, ప్రజాస్వా మ్యం, ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు తెలంగాణను నిర్బంధంలోకి నెడుతున్నది. అధికారంలోకి రాగానే ప్రజాభవన్ వద్ద కంచెలు కూల్చి, ఇకపై ఆంక్షలు ఉండవంటూ హడావుడి చేసిన ప్రభుత్వం.. తాజాగా తన అసలు రంగును బయటపెట్టింది. తమ అసమర్థ పాలనను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పోలీసులను నమ్ముకుంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నది. అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంతోషాలను మింగేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రశ్నించే హక్కును కాలరాసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలు చేయగా, జిల్లాల్లోనూ పోలీస్ యాక్ట్‌ను విధిస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో నవంబర్ మొత్తం పోలీస్ యాక్ట్ అమలు చేశారు. కామారెడ్డి జిల్లాలో గత నెల 7 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నది. కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పటివరకు అధికారికంగా 13 జిల్లాల్లో పోలీస్ యాక్ట్‌ను అమలు చేయగా, అనధికారికంగా 20కి పైగా జిల్లాల్లో పోలీస్ యాక్ట్ నిబంధనలను అమలు చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు సర్కార్ సరికొత్త యోచన



హైదరాబాద్, డిసెంబర్ 3: నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం అనేక మార్గాలను అన్వేషిస్తోంది. ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరే ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ఇప్పటికే శ్రీకారం చుట్టింది. అలాగే మరింత వేగంగా గమ్యాలను చేరుకునేందుకు ఎలివేటర్ కారిడార్ల నిర్మాణాన్ని తెరపైకి తీసుకువస్తోంది రేవంత్ సర్కార్. దీనికి సంబంధించి భూసేకరణ కోసం పలు నోటిఫికేషన్‌లు జారీ చేసింది. ఇంతకీ ప్రభుత్వం ఏఏ ప్రాంతాల్లో ఎలివేటర్ల నిర్మాణానికి నోటిఫికేషన్ జారీ చేసిందో ఇక్కడ చూద్దాం..

సచివాలయ వ్యవస్థలో సమూల మార్పులు

ఎలివేటర్ కారిడార్ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఎలివేటెడ్ కారిడార్ కోసం తాజాగా భూ సేకరణ నోటిఫికేషన్ విడుదలైంది. పారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూసేకరణ సర్కార్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2013 భూ సేకరణ చట్టం సెక్షన్11(1) ప్రకారం మొత్తం 8 నోటిఫికేషన్‌లను ప్రభుత్వం విడుదల చేసింది. హైదరాబాద్ జిల్లా తిరుమలగిరి మండలం కాకాగూడ, తోకట్ట గ్రామాల్లో 40, 213.516 చదరపు గజాల భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. హైదరాబాద్ జిల్లా తిరుమలగిరి మండలం ఖాకాగూడ, తిరుమలగిరి గ్రామాల్లో ఒక చోట 17,607 చదరపు గజాలు, మరోచోట 20, 241.95 చదరపు గజాల భూ సేకరణకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ అయ్యింది. అలాగే హైదరాబాద్ జిల్లా తిరుమలగిరి గ్రామంలో మూడు ప్రాంతాల్లో భూసేకరణ కోసం మూడు వేరు వేరు నోటిఫికేషన్‌లను అధికారులు రిలీజ్ చేశారు. హైదరాబాద్ జిల్లా ఒకచోట13,510.10 చదరపు గజాలు, మరోచోట11, 973.40 చదరపు గజాలు, ఇంకో చోట 11,836. 67 చదరపు గజాల భూ సేకరణ కోసం మూడు వేరు వేరు నోటిఫికేషన్‌ను రెవెన్యూ శాఖ విడుదల చేసింది. హైదరాబాద్ జిల్లా తిరుమలగిరి మండలం తోకట్ట గ్రామంలో 35, 360. 76 చదరపు గజాల భూసేకరణకు నోటిఫికేషన్ విడుదలైంది. హైదరాబాద్ జిల్లా తిరుమలగిరి, మచ్చ బొల్లారం గ్రామాలలో 12, 150.17 చదరపు గజాల భూ సేకరణకు మరో నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. అలాగే పారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు మొత్తం162,893.61 చదరపు గజాల భూ సేకరణ కోసం ఎనిమిది నోటిఫికేషన్స్‌ను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. భూ సేకరణపై అభ్యంతరాలు ఉంటే 60 రోజుల వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలియజేయవచ్చని నోటిఫికేషన్‌లో అధికారులు స్పష్టం చేశారు.

# కాషాయం కట్టొద్దు.. తులసి మాల దాచేయండి: ఇస్కాన్ సూచన

కోల్‌కతా:'కాషాయం ధరించడం మానుకోండి.. తిలకం పెట్టకండి.. తులసి జపమాల ఎవరికీ కనపడనీయకండి'.. ఇదీ కోల్‌కతాలోని ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్ (ఇస్కాన్) బంగ్లాదేశ్‌లోని హిందువులకు, కృష్ణ భక్తులకు ఇచ్చిన సలహా. ఇలా చేసినప్పుడే మతఛాందనవాదుల నుంచి రక్షించుకోగలుగుతారని ఇస్కాన్ అక్కడి హిందువులకు సూచించింది. ఇస్కాన్ కోల్‌కతా వైస్ ప్రెసిడెంట్ రాధారమణ్ దాస్.. బంగ్లాదేశ్‌లోని హిందువులు దేవాలయాలలో లేదా తమ ఇళ్లలో మాత్రమే తమ మతాచారాలను పాటించాలని, బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సంక్షోభ సమయంలో తమను తాము రక్షించుకునే దృష్టితో ఉండాలని ఆయన సలహా ఇచ్చారు. కాషాయ వస్త్రాలు ధరించవద్దని, నుదుటిపై తిలకం పెట్టుకోవద్దని రాధారమణ్ దాస్ సూచించారు. తులసిమాలను మెడలో ధరించాలనుకుంటే దానిని బయటకు కనిపించకుండా చూసుకోవాలని రాధారమణ్ దాస్ విజ్ఞప్తి చేసినట్లు ఓ ఆంగ్ల దినపత్రిక కథనం వెలువరించింది. బంగ్లాదేశ్‌లోని హిందువులు బయటకు సాధువులుగా కనిపించకుండా తమను తాము చూసుకోవాలని రాధారమణ్ దాస్ కోరారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలు, ఇస్కాన్ సన్యాసులపై హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల బంగ్లాదేశ్‌లో ఒక చట్టపరమైన కేసులో ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణ దాస్‌ను అరెస్టు చేశారు. న్యాయవాది రమణ్‌రాయ్‌పై దాడి జరిగింది. అతని పరిస్థితి విషమంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మిక బోధకుడు చిన్మయ్ కృష్ణ దాస్‌ను అక్టోబర్ 25న అరెస్టు చేసినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. చిట్టగాంగ్‌లో బంగ్లాదేశ్ జాతీయ జెండాపై కాషాయ జెండాను ఎగురవేసినందుకు



ఆయనపై దేశద్రోహం కేసు నమోదైంది. దాస్ అరెస్టు అనంతరం నవంబర్ 27న చిట్టగాంగ్ కోర్ట్ బిల్డింగ్ ప్రాంతంలో పోలీసులకు, ఆధ్యాత్మిక గురువు అనుచరులకు మధ్య జరిగిన ఘర్షణలో ఒక న్యాయవాది మృతిచెందాడు. బంగ్లాదేశ్‌లో పెరుగుతున్న హింసాయుత ఘటనలపై భారతదేశం ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పీ) ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేతలు బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దురాగతాలను అరికట్టేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లోని హిందువులకు భద్రత కల్పించాలంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రదర్శన నిర్వహించారు.

# డిస్ట్రిక్ రీఆర్గనైజేషన్‌పై ఏపీ సర్కార్ స్టెప్ ఏంటి?

అమరావతి,గత సర్కార్ హయాంలో అడ్డగోలుగా జిల్లాల విభజన జరిగినట్లు కూటమి పెద్దలు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి మారుమూల గ్రామాలకు ఉన్న దూరం, పాలనా కేంద్రం, మండలాలు, రెవెన్యూ డివిజన్లు ఇవన్నీ ఎలా తోస్తే అలా చేసేశారట. రాజకీయ అవసరాలకు తగ్గట్లుగా మార్చేశారట. చాలా నియోజకవర్గాల్లో కొన్ని మండలాలను ఓ జిల్లాలో, మరికొన్ని మండలాలను ఇంకో జిల్లాలో కలిపేశారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లను కూడా విడదీశారు. ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాలను వేర్వేరు జిల్లాల్లో కలిపేశారు. ప్రతీ లోక్‌సభ స్థానాన్ని ఓ జిల్లాగా ఏర్పాటు చేస్తానన్న మాటను కూడా జగన్ నిలబెట్టుకోలేదు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలను మరో జిల్లాలో కలిపారంటున్నారు కూటమి నేతలు.

సుదూర ప్రాంతాలను కలిపి జిల్లాగా ఏర్పాటు

ప్రజల సౌకర్యం గురించి ఆలోచించకుండా సుదూర ప్రాంతాలను కలిపి జిల్లాగా ఏర్పాటు చేశారు. రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు 245 కి.మీ. దూరంలో ఉంది. రంపచోడవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి దూరం 225 కిలోమీటర్లు. అంటే జిల్లా కేంద్రం కంటే రాష్ట్ర రాజధానే ఇంకో 20 కిలో మీటర్లు దగ్గరన్నమాట. ఇక శ్రీకాకుళం జిల్లాలోని రాజాం నియోజకవర్గాన్ని రాజకీయ కోణంలో విజయనగరం జిల్లాలోకి తెచ్చారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు, గన్నవరం మండలాలను తీసుకెళ్లి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణాజిల్లాలో కలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు దూరాభారం తగ్గాలి. కానీ రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లలోని 11 మండలాల ప్రజలు తమకు లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడేరు కేంద్రంగా పాడేరుతో పాటు ఈ రెండు రెవెన్యూ డివిజన్లతో అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేశారు. రంపచోడవరం డివిజన్ నుంచి పాడేరు 245 కి.మీ. దూరంలో ఉంది. పునర్విభజనకు ముందు జిల్లా కేంద్రం కాకినాడకు చేరుకోవాలంటే 80 నుంచి 180 కి.మీ. వెళ్తే సరిపోయేది. ఇప్పుడు పాడేరుకు వచ్చి వెళ్లాలంటే ఒకరోజు పడుతుంది. చింతూరు డివిజన్ వాసులదీ ఇదే పరిస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాల పునర్విభజనలో ఎన్నో లోపాలు ఉన్నాయి. చాలా జిల్లాలలో ఇదే పరిస్థితి. కొత్త జిల్లాల కేంద్రాలలో ఇప్పటికీ కార్యాలయాలు లేవు.



తప్పులను సరిదిద్దుతామని హామీ

అయితే నాడు జగన్ చేసిన తప్పులను సరిదిద్దుతామని ప్రతిపక్షనేతగా చంద్రబాబు పలు సభల్లో హామీ ఇచ్చారు. ఇప్పుడు జిల్లాల విభజన ద్వారా జగన్ తెచ్చిపెట్టిన కష్టాల నుంచి కూటమి ప్రభుత్వం విముక్తి కల్పిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు ప్రజలు. అయితే కూటమి సర్కార్ డిస్ట్రిక్ రీఆర్గనైజేషన్ మీద ఏం చేయబోతుందనేది ఆసక్తికరంగా మారింది. పలు రెవెన్యూ డివిజన్లు, జిల్లాల సరిహద్దులు మార్చబోతుందా అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే ఇప్పుడున్న పరిస్థితులు జిల్లా పునర్విభజన అనేది పెద్ద తలనొప్పిగా చెప్తున్నారు కొందరు అధికారులు. ఇప్పుడిప్పుడే కొత్త జిల్లాల్లో పాలన, అభివృద్ధి పరుగులు పెడుతుందని ఈ సమయంలో డిస్ట్రిక్ రీఆర్గనైజేషన్‌కు పూనుకుంటే..సమయంతో కూడుకున్న పని అంటున్నారు. ఆఫీసుల షిఫ్టింగ్‌తో పాటు.. సెంటర్ పాయింట్‌గా జిల్లా కేంద్రాల ఏర్పాటు కూడా అంత ఈజీ కాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు లేవని..ఆఫీసులు, కలెక్టరేట్ల కోసం స్థలాలు కొనాలంటే భారం అవుతుందని..అంతకంటే ముందు రీఆర్గనైజేషన్ ప్రాసేసే పెద్ద తలనొప్పి అంటున్నారు. అయితే కూటమి పెద్దలు ఎన్నికల్లో ఇచ్చినా ఒక్కో మాటను నిలబెట్టుకుంటూ వస్తున్నారు. జిల్లాల పునర్విభజనపై అధికారుల అభిప్రాయాలు ఎలా ఉన్నా..చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తప్పులను సరిదిద్దే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అయితే కొంత టైమ్ తీసుకునే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి

# కొనసాగుతున్న ఫెంగల్ తుపాను బీభత్సం



చెన్నై : తమిళనాడు, పుదుచ్చేరిలో ఫెంగల్ తుపాను బీభత్సం కొనసాగుతోంది. తమిళనాడులో తిరువణ్ణమలై పట్టణం అన్నమలైయార్ హిల్ వద్ద ఆదివారం సాయంత్రం నివాస భవనంపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో భవనంలో ఉన్న ఏడుగురిలో ఐదుగురి మృతదేహాలను సోమవారం వెలికితీశారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల్లో ఒక మహిళ, ఒక చిన్నారి ఉన్నారు. స్థానికుల సమాచారం ప్రకారం ఈ భవనంలో రాజ్‌కుమార్, మీనా దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. మీనా సోదరుడి మరో ముగ్గురు పిల్లలు కూడా వీరితో కలిసి ఉంటున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో పాటు స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చెన్నై ఐఐటికి చెందిన సాంకేతిక నిపుణులు కూడా వీరికి సహాయం చేస్తున్నారు.

ఊటిలో ఇల్లు కూలి ఒక వ్యక్తి మృతి

తమిళనాడు నీలగిరి జిల్లా ఊటీ నొండిమేడు వద్ద భారీ వర్షాల కారణంగా బలహీనపడిన ఇల్లు సోమవారం తెల్లవారుజామున కూలిపోయిందని, ప్రమాదంలో 45 ఏళ్ల ఆరుముగం మరణించాడని అధికారులు తెలిపారు.

పంటలకు తీవ్రనష్టం.. పలు రైళ్ల రద్దు కొట్టుకుపోయిన వాహనాలు

తమిళనాడులోని విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాల్లో దాదాపు 1,29,000 హెక్టార్లలో పంటలు నీట మునిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం తెలిపారు. తుపాను నష్టంపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని, నష్టపోయిన వారందరికీ సాయం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో సోమవారం కూడా వర్షాలు కురిసాయి. విల్లురం జిల్లాలో వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు మునిగిపోయాయి. రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడంతో కొన్ని రైళ్లను రద్దు చేశారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రిష్ణగిరి జిల్లా ఊతరగరై, పోచంపల్లి తాలుకాల్లో భారీ వర్షాలకు రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించింది. జాతీయ రహదారులకు అనుసంధానం తెగిపోయింది. ఉత్తంగరై హైవేపై పక్కన నిలిపి ఉంచిన బస్సులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఈ రెండు తాలుకాల్లో మంగళవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ జిల్లాల్లో అన్నామలై యూనివర్శిటీ పరీక్షలను వాయిదా వేసింది. పుదుచ్చేరిలోనూ వర్షాల కారణంగా నలుగురు మరణించారని ముఖ్యమంత్రి ఎన్ రంగసామి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికి రూ 5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద 3.54 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు సహాయం అందజేస్తామని ప్రకటించారు. బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని తెలిపారు. ఈ నెల 3, 5 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను పుదుచ్చేరి యూనివర్శిటీ రద్దు చేసింది. తాజా తేదీలను త్వరలో ప్రకటిస్తామని అసిస్టెంట్ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయని చెప్పారు.

బెంగుళూరులో ఆగని వర్షాలు

తుపాను కారణంగా బెంగళూరు ముంపునకు గురైంది. వర్షాలు కురుస్తుండటంతో సోమవారం కూడా రోడ్లపై నీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అల్పపీడనంగా బలహీన పడిన తుపాను

తుపాను సోమవారం ఉదయం 5:30 గంటల సమయంలో అల్పపీడనంగా బలహీనపడిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం మంగళవారం నాటికి ఉత్తర కేరళ, కర్ణాటక తీరాల్లో తూర్పు-మధ్య అరేబియా సముద్రంలో కలిసి పోయే అవకాశం ఉందని తెలిపింది. ఈ కారణంగా మంగళవారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర కేరళలోని ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# సొంత జిల్లాపై సీఎం రేవంత్ మమకారం.. మంత్రులకు రిక్వెస్ట్



హైదరాబాద్,ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే. అవును రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రే అయినా.. పాలమూరుకు మాత్రం జిల్లావాసే. అందుకే సొంత జిల్లాపై ఉన్న మమకారాన్ని మరోసారి బయటపెట్టారు సీఎం. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రులను కోరారు. సీఎం స్థాయిలో తన జిల్లాకు ఏం కావాలో చేసుకునే రేంజ్‌లో ఉన్నా.. రిక్వెస్ట్ మ్యానర్‌లో సహచర మంత్రులను తనదైన స్టైల్లో జిల్లా అభివృద్ధికి హెల్ప్ చేయాలని కోరడం రేవంత్‌రెడ్డి చాకచక్యానికి నిదర్శనమంటున్నారు రాజకీయ విశ్లేషకులు. తానొవ్వక..నొప్పించక ధన్యుడు సుమతి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు సీఎం రేవంత్. అందులోనూ తన సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్ అభివృద్ధి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. సీఎం హోదాలో తన జిల్లాకు ఏం కావాలో అది మంజూరు చేసుకునే పొజిషన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి..జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అటు సొంత పార్టీతో పాటు ఇటు అపోజిషన్ నుంచి విమర్శలు రాకుండా స్కెచ్ వేస్తున్నారట. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, సొంత జిల్లాకు ఎక్కువ నిధులను తీసుకెళున్నారనే టాక్ రాకుండా కేర్ తీసుకుంటున్నారట రేవంత్.

మిగతా మంత్రులు ఏమనుకుంటారోనని..

సొంత జిల్లాకు ఏం కావాలో అది తీసుకెళ్తే.. మిగతా మంత్రులు ఏమనుకుంటారోనని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా.. తన సొంత జిల్లాపై కాస్త ప్రేమ చూపించాలని విజ్ఞప్తి చేయడం ఆసక్తికరంగా మారింది. పాలమూరు జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఫైళ్లపై కొన్ని ఎక్కువ సంతకాలు చేయాలని సరదాగా అన్నప్పటికీ.. సీఎం తన సొంత జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రులను కోరడం ఆయన రాజకీయ చాకచక్యానికి నిదర్శనమంటున్నారు రాజకీయ ఎనలిస్టులు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి మొదలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..ఇలా మంత్రులందరిని మహబూబ్ నగర్ అభివృద్ధికి సహకరించాలని స్వయంగా కోరడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందనే చర్చ జరుగుతోంది. నీటిపారుదల రంగం నుంచి మొదలు ప్రతి శాఖకు సంబంధించి అభివృద్ధి పనుల్లో మహబూబ్ నగర్‌ను దృష్టిలో పెట్టుకుని, పాలమూరు జిల్లా ఫైల్ అనగానే ఏ మాత్రం ఆలోచించకుండా సంతకాలు పెట్టాలని మంత్రులను కోరడం చర్చనీయాంశంగా మారింది. అటు మహబూబ్ నగర్ ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకోవడంతో పాటు మిగతా జిల్లాల ప్రజలు కూడా కన్విన్స్ అయ్యేలా రేవంత్ చాతుర్యం ప్రదర్శించారని అంటున్నారు. ఇదే సమయంలో ఏ మంత్రిత్వ శాఖలో తాను తల దూర్చడం లేదని, తన మంత్రి వర్గంలోని మంత్రులందరికి పూర్తి స్వేచ్ఛ ఉందని చెప్పే ప్రయత్నం చేశారట. ఆఖరికి తన జిల్లా అభివృద్ధిపై కూడా మంత్రులదే ఫైనల్ డెసిషన్ అన్నట్లుగా చెప్పుకొచ్చారు ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి మంత్రులతో సరదాగా మాట్లాడినా.. ఆయన మాటల్లో చాలా అంతర్యం ఉందన్న చర్చ జరుగుతోంది.

## కేంద్రం వైఖరికి నిరసనగా మళ్లీ రైతుల పోరుబాట

న్యూడిల్లీ, కేంద్రం వైఖరికి నిరసనగా రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. తమ డిమాండ్ల విషయంలో మోదీ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు మరోసారి కదం తొక్కారు. తమ డిమాండ్ల సాధన కోసం నేడు పార్లమెంట్ కాంప్లెక్స్ ముట్టడికి రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ ఉదయం యూపీ రైతులు నోయిడా నుంచి ఢిల్లీకి మార్చ్ నిర్వహించారు. రైతుల ఆందోళనతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. రైతుల పాదయాత్రతో భారీగా ట్రాపిక్ జామ్ ఏర్పడింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లపై రైతులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. వారితో చర్చలకు సైతం సుముఖత చూపడం లేదు. దీంతో కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుల డిమాండ్ల సాధనకు ఈ నెల

# సచివాలయ వ్యవస్థపై మల్లగుల్లాలు..

అమరావతి : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరణ చేయడానికి ప్రభుత్వం తాజాగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ప్రభుత్వం ఇతమిద్ధంగా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నట్లు సమాచారం. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో టెక్నికల్, విద్యార్హత అధికంగా ఉన్నవారి సేవలను ఆయా శాఖల మాతృ సంస్థల్లో ఉపయోగించుకుంటే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో నడుస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించకపోవడంతో పునర్ వ్యవస్థీకరణ అంశం ఇప్పట్లో ఉండకపోవచ్చనే అభిప్రాయం సచివాలయ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు, ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి గ్రామ, వార్డు సచివాలయాల ఉన్నతాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వం ముందుంచిన ప్రతిపాదనలకు సిఎం సుముఖత వ్యక్తం చేయలేదని సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు మరోసారి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని సిఎం పేర్కొన్నట్లు తెలిసింది. ఈసారి సమావేశానికి వచ్చేటప్పుడు నూతన ప్రతిపాదనలతో ముందుకు రావాలని జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారులను సిఎం ఆదేశించినట్లు తెలిసింది. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రతిపాదనల ఆమోదం కోసం ప్రత్యేకంగా కేబినెట్ సబ్ కమిటీని నియమించాలనే అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ కమిటీ సమర్పించే నివేదికను ఆధారంగా చేసుకుని విధి విధానాల ప్రకారం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. సమీక్షలో పంచాయతీకి ఒక సచివాలయం లేదా 5 వేల జనాభాకు ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి సరిపడా సిబ్బందిని నియమిస్తే ఎలా ఉంటుందనే అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది. మిగిలిన సచివాలయ సిబ్బందిని రేషనలైజేషన్ చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా చర్చించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ప్రమోషన్ల గురించి కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. గతంలో చేసిన క్యాస్ట్ సర్వే, సోషల్ ఆడిట్ కోసం సచివాలయాల్లో డిస్‌ప్లే చేయడం, అనంతరం ఆ డేటా పథకాలకు ఉపయోగించే అంశంపై చర్చ జరిగింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు




ఎలా చేస్తే బాగుంటుందనే అంశంపై గ్రౌండ్ రియాల్టీ ప్రతిబింబించే విధంగా ఆలోచన చేయాలని అధికారులకు సిఎం సూచించినట్లు తెలిసింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రతిరోజూ మూడు సార్లు తప్పనిసరి చేయాలని ఆశించింది. సచివాలయ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఉద్యోగులను వీలైనంత వరకు సొంత నియోజకవర్గం కాకుండా అటు ఇటు మార్చితే ఎలా ఉంటుందనే అంశంపైనా ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

## క్రికెట్ స్టేడియానికి కర్ణాటక సీఎం శంకుస్థాపన

బెంగళూరు, కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించాలన్న దీర్ఘకాలిక డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. ఈ మేరకు 'కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డు' నుంచి కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోషియేషన్‌కు భూకేటాయింపు జరిగింది. స్టేడియం నిర్మాణానికి మొత్తం 41 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోమవారం ఉదయం తుమకూరులో క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. మొత్తం 41 ఎకరాల్లో నిర్మించనున్న ఈ స్టేడియాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు మొత్తం రూ.150 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా వేశారు. స్టేడియం పూర్తయితే ఇక్కడ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com